ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 | సంచిక : 5 | జనవరి 2023

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో. . . .


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2

అక్షరమణమాల ........................................................ 29

అరుణాచలా శ్రీరమణ రూపా శ్రీనాన్న గురుదేవా! ...... 31


మహాత్ముల లక్షణం .................................................. 31

శ్రీనాన్నగారి మీటింగుల ప్రయోజనం........................ 32

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం

ఎవడైతే రాగాన్ని, భయాన్ని, క్రోధాన్ని విడిచి పెట్టాడో, వాడి బుద్ధి మటుకే, వాడి జ్ఞానం మటుకే, వాడి ప్రజ్ఞ మటుకే స్థిరంగా ఉంటుంది. ఎవడికైతే రాగం ఉందో, ఎవడికైతే భయం ఉందో, ఎవడికైతే కోపం ఉందో, వాడు తాత్కాలికంగా శాంతిగా ఉన్నప్పటికీ వాడి బుద్ధి ఎన్నడూ స్థిరంగా ఉండదు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 05 ఫిబ్రవరి 1988, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా! మనం గీతా సంఘం వారి ఆహ్వానాన్ని పురస్కరించుకుని ఈ గ్రామంలో కార్యక్రమాలు జరుపుకుంటున్నాము. మనకి దేహం వస్తుంది, దేహం పెరుగుతుంది, దేహం నశిస్తుంది. దేహం మనం అనుకుంటున్నాం కాబట్టి, దేహం పుట్టినప్పుడు మనం పుట్టాం అనుకుంటున్నాం. దేహం పెరిగినప్పుడు మనం పెరిగాం అనుకుంటున్నాం. దేహం మరణించినప్పుడు మనం మరణించాం అనుకుంటాం. ఈ దేహం తోటే తాదాప్యం పొందటం వల్ల, ఆ రకంగా మనం అనుకుంటాం. దేహాన్ని ఎవరైనా పొగిడితే నన్ను పొగిడారు అనుకుంటాం. దేహాన్ని ఎవరైనా విమర్శిస్తే నన్ను విమర్శించారు అనుకుంటున్నాం. అందరూ తలో దేహం తోటి కట్టుబడి ఉన్నాం. ఇలా దేహం తోటి కట్టుబడి ఉండకపోతే కర్మ ఎవరు అనుభవిస్తారు? నేను కర్మ అనుభవిస్తున్నాను, నేను కర్మ అనుభవిస్తున్నాను అని అంటారు చాలామంది. ఎవరు ఈ కర్మ అనుభవించేది? దూడను కట్టురాడుకి కట్టినట్టు ఈ దేహం నాది అనే భావన పరమేశ్వరుడి మాయ వల్ల మనకు వచ్చింది. అందుచేత నేను కర్మ అనుభవిస్తున్నాను, నేను కర్మ అనుభవిస్తున్నాను అనుకుంటాడు. పాప ఫలితం వచ్చినప్పుడు కష్టం అనుభవిస్తున్నాను అనుకుంటాడు, పుణ్య ఫలితం వచ్చినప్పుడు సుఖం అనుభవిస్తున్నాను అనుకుంటాడు. అంటే ఏమిటి? దేహం తాను అని అనుకోవడం వల్ల, ఈ భావాలు వచ్చినవి, ఈ కర్మ అనుభవాలు ఇవన్నీ వచ్చినవి.

ఈ మధ్య విశాఖపట్నం వెళ్ళాము, అక్కడ లక్ష్మి ఒకళ్ళ ఇంటికి తీసుకు వెళ్ళింది. వాళ్ళ ముగ్గురు అమ్మాయిలకి కూడా మాటలు రావు. అందులోను చిన్న పిల్లలు ఇద్దరు స్పోర్ట్స్‌లో చాలా ఫస్ట్, అందులో రెండో అమ్మాయిని జపాన్ ప్రభుత్వం స్పోర్ట్స్‌లో ఆహ్వానించింది. ఆ రెండో అమ్మాయి రైలు గేటు దాటుతూ ఉంటే, ఆ రైలు వచ్చే సౌండ్ కూడా వినపడక పోవడంతో పాపం రైలు కింద పడి చనిపోయింది. ఈ అమ్మాయి నానమ్మ ఏవండీ నేనొక ప్రశ్న అడుగుదాం అనుకుంటున్నాను అని పుస్తకాలలో ఉన్న ఒక ప్రశ్న అడిగారు. ఏవండీ జన్మ ముందా? కర్మ ముందా? ఇది ప్రశ్న. నేను అన్నాను కర్మ ముందో,జన్మ ముందో ఏదో ఒకటి ముందు అనుకుందాం. అవి రెండు ఎవరికి? నువ్వు ఉంటే కర్మ వచ్చిందా? నువ్వు ఉంటే జన్మ వచ్చిందా? నువ్వు లేకుండానే కర్మ ఉందా? నువ్వు లేకుండానే జన్మ ఉందా? నేను ఉంటే కర్మ ఉంది. నేను ఉంటే జన్మ ఉంది. నేను ఉంటే దేవుడు ఉన్నాడు. నేను ఉంటే లోకం ఉంది. నేను ఉంటే విషయం ఉంది, నేను లేకపోతే ఏమి లేదు. ఈ దేహం లేకుండా, దేవుడు లేకుండా, లోకం లేకుండా మీరు ఉన్నారు. కాని మీరు లేకపోతే దేవుడు లేడు, లోకం లేదు, ఏది లేదు.

ఆవిడ ప్రశ్న జన్మ ముందా? కర్మ ముందా? అని, దీనికి గౌతమ బుద్ధుడు సమాధానం చెప్పాడు. మీరు ఇంటి దగ్గర నుంచి ఈ గీతామందిరానికి నడిచి వస్తుంటే కాళ్ళలో ముల్లు దిగింది. ఆ ముల్లు మిమ్మల్ని బాధపెడుతోంది. మీ అంతట మీరు ఆ ముల్లు తీసుకోవటం, లేకపోతే ఆసుపత్రికి వెళ్లి ముల్లు తీయించుకోవటానికి ప్రయత్నం చేయటం మంచిదా? లేకపోతే ముల్లు ఎక్కడ దిగింది? ఏ ఫర్లాంగు రాయి దగ్గర దిగింది? అని విచారణ చేయటం మంచిదా? అని అడిగాడు. ఫలానా చోటు ముల్లు దిగిందని మీరు కష్టపడి గుర్తు పడతారు అనుకోండి, దాని వలన మీకు కలిసి వచ్చేది ఏమిటి? మీ బాధ పోతుందా? దానివల్ల మీకు కలిసి వచ్చేది ఏమి లేదు. అదే విధంగా ఈ కర్మ ఎప్పటి నుంచి వచ్చింది? ఈజన్మ ఎప్పటి నుంచి వచ్చింది. ముందు కర్మా? ముందు జన్మా? అని విచారణ చేయటం కంటే, ఈ కర్మ నాకు, ఈజన్మ నాకు, అని నేను అనుకుంటున్నాను, ఈ నేను ఎవరు?

భగవాన్ ఏమని చెప్పారు అంటే ఈ దేహం నువ్వు అనుకుంటున్నావు. ఈ మనస్సు నువ్వు అనుకుంటున్నావు. ఈ కోరికలు నువ్వు అనుకుంటున్నావు. ఈ నేను ఎవరు అనే ప్రశ్నను నువ్వు ధ్యానం చెయ్యి, విచారణ చెయ్యి, అలా విచారణ చెయ్యిగా, ధ్యానం చెయ్యిగా క్రమంగా, క్రమంగా ఈ దేహం నువ్వు కాదని, ఈ కోరికలు నువ్వు కాదని, ఈ మనస్సు నువ్వు కాదని, నీ అంతట నీకే తెలుస్తూ ఉంటుంది అనుభవంలో అన్నారు. నేను ఉన్నాను అని నీకు తెలుసు కదా. నేను ఎవరు అని విచారణ చెయ్యి. ఆ నేను ఎవరు అని ధ్యానం చెయ్యి. అలా చెయ్యిగా చెయ్యిగా నీ దేహం లోంచి, నీ కోరికలు లోంచి, నీ అహంకారం లోంచి, నీ మనస్సు లోంచి, నీబుద్ధి లోంచి నువ్వు కాని దానిలో నుండి విడిపోతావు. కాని దానిలో నుండి నువ్వు ఎప్పుడైతే విడిపోయావో, నువ్వు ఏది అవునో అది అవుతావు. భగవాన్ అన్నారు మనం ఏది అయితే అవునో అది కాదు అనుకుంటున్నాం. ఏది కాదో అది అవును అనుకుంటున్నాం. అందుకే మాయ వచ్చి మన ముక్కు పట్టుకుంది. ఏవండీ, దూడను కట్టురాడుకి కట్టి కొడితే ఎన్ని కొట్టినా ఆ బాధలు సహిస్తూ ఉంటుంది. ఎందుచేత? తాడు కట్టురాడుకి కట్టి ఉంది. దానికి పారిపోదాం అని ఉంటుంది. కాని తాడు కట్టురాడుకి కట్టేసి ఉంది. అది ఎక్కడికి పరుగెడుతుంది? ఆ దెబ్బలు అన్నీ భరిస్తుంది. నేను ఎంత బాధ పడుతున్నానో, ఎవరైనా రక్షిస్తే బాగుండును, ఎవరైనా తాడు విప్పేస్తే బాగుండును, అని ఆ దూడ ఎలా అనుకుంటుందో మనం కూడా కట్టురాడుకి కట్టేసి ఉన్నాము. ఈ దేహం నేను అనుకుంటున్నాం, ఈ దేహమే నేను అనే బుద్ధే మనల్ని కట్టురాడుకి కట్టేయటం. ఈ కట్టురాడుకి కట్టేసి మన కర్మానుసారం ఈశ్వరుడు మనల్ని మొడుతున్నాడు. అదే కర్మానుభవం.

ఈ దేహం లోంచి మీరు విడిపోతే, ఈ మనసు లోంచి మీరు విడిపోతే, ఈ అహంకారం లోంచి మీరు విడిపోతే మీకు కర్మ తోటి పనేముంది? ఈజన్మ తోటి పనేముంది? మీరు

పూజించే దేవుడి తోటి పనేముంది? మీరు ఎక్కడికి వెళతారు. నువ్వు లేని చోటు ఎక్కడ ఉంది? మనం దేహానికే పరిమితం అయ్యి ఉన్నాము కాబట్టి దేహం ఎక్కడ ఉంటే అక్కడ నేను ఉన్నాను అని అనుకుంటాం. మనసు ఏది ఆలోచిస్తుంటే అదే నేను అని అనుకుంటాను. కాని అది నేను కాదు. ఈ గంటలో ఉన్న ఆలోచన మరొక గంటలో ఉండదు. ఈ రోజున ఉన్న ఆలోచన రేపు ఉండదు. దేహం యొక్క స్వరూపం మారుతూ ఉంటుంది. మనసు యొక్క స్వరూపాలు మారుతూ ఉంటాయి. తలంపులు మారుతూ ఉంటాయి, ఆలోచనలు మారుతూ ఉంటాయి. లోకం యొక్క స్వభావం మారుతూ ఉంటుంది. మన కుటుంబ పరిస్థితులు మారుతూ ఉంటాయి. ప్రతీది మారేదే, మారనిది ఒక్కటే ఉంది. అదే ఆత్మ. నువ్వు దేహం కాదు, నువ్వు మనసు కాదు, నీ హృదయంలో ఆత్మ ఉంది అని చెప్పి అది నువ్వే అన్నాడు. దానికి మరణం లేదు, దానికిజన్మ లేదు. జన్మించినది మరణిస్తుంది. అసలు జన్మే లేని దానికి మరణం ఏమిటి? నీ హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మని నేనే అని భగవంతుడు చెప్పి అది నువ్వే, నిన్ను నీవు తెలుసుకో అని చెప్పాడు. నిన్ను నువ్వు తెలుసుకో అంటే ఇక్కడ రెండు నేనులు ఉన్నాయి. అంటే ఈ నేను మనం అనుకునే దేహానికి పరిమితం అయిన నేను, మనసుకి పరిమితం అయిన నేను, అహంకారానికి పరిమితం అయిన నేను, ఈ నేనే గనుక నిజమైతే ఈ నేనే గనుక యదార్థమైతే నిన్ను నువ్వు తెలుసుకో అని భగవంతుడు చెప్పవలసిన పని లేదు.

నాకు దేవుడు కావాలి. నాకు మోక్షం కావాలి అని మీరందరూ అన్వేషించుకుంటున్నారు. పురాణాలు చదువుతున్నారు. పెద్దలు చెప్పిన మాటలు వింటున్నారు. నిజంగా మీకు దేవుడే కావాలా? నాకు దేవుడిని తెలుసుకోవాలని ఉందని భగవాన్‌ని ఎవరో అడిగారు. భగవాన్ అన్నారు దేవుడు ఎప్పుడైనా నీ దగ్గరకి వచ్చి నన్ను తెలుసుకోమని అడిగాడా? ఆయన అడగనప్పుడు నీకు ఎందుకు అయ్యా ఆ గొడవ? నన్ను తెలుసుకోమని దేవుడు ఎవరిని అడగలేదు. మీరే అనుకుంటున్నారు తెలుసుకోవాలి, తెలుసుకోవాలి అని, మీకు తెలుసుకోవాల్సిన అవసరం ఏమిటి? దేవుడిని తెలుసుకోకపోతే మీకు నష్టం ఏమిటి? దేవుడు మిమ్మల్ని అడుగుతున్నాడా నన్ను తెలుసుకోమని, అది కాదు. మిమ్మల్ని మీరు తెలుసుకునే ప్రయత్నంలో దేవుడిని అడ్డు పెట్టుకుని దేవుడిని తెలుసుకోవాలి అని అంటున్నారు. దేవుడిని తెలుసుకోవటం కాదు, మిమ్మల్ని మీరు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మనల్ని మనం తెలుసుకోవటమే దేవుడిని తెలుసుకోవటం. నిన్ను నువ్వు తెలుసుకోకుండా, దేవుడిని తెలుసుకుంటే ఆ దేవుడు అబద్ధం, ఆ దేవుడు నిజం కాదు. నువ్వు తెలుసుకుంటున్న దేవుడు అది దృశ్యం. ఒకవేళ రాముడు మీకు కనిపిస్తాడు అనుకోండి, రాముడు మీ దగ్గర ఎంతసేపు కూర్చొంటాడు? మీరు ఎంతసేపు చూస్తారు? కృష్ణుడు మీకు కనిపిస్తాడు అనుకోండి మీరు ఎంతసేపు చూస్తారు?

ఆయన ఎంతసేపు కూర్చొంటాడు? అది కూడా మానసిక దర్శనమే. మిమ్మల్ని మీరు తెలుసుకోవటమే దేవుడిని చూడటం. మిమ్మల్ని మీరు తెలుసుకోకుండా దేవుడిని చూస్తే అది నిజం కాదు. అది కేవలము మానసిక దర్శనమే. ఈ సృష్టిలో అనేక దృశ్యాలు ఎలా అయితే చూస్తున్నామో, అది కూడా ఒక దృశ్యం మాత్రమే. ఈ దృశ్యం నశించి తీరుతుంది. నా దేహమే నశిస్తున్నప్పుడు, నా దేహంతోటి చూస్తున్న దృశ్యాలు నిజం ఎలా అవుతాయి?

మీ దేహం మీరు కానప్పుడు రాముడి దేహం రాముడు అవుతాడా? మీ దేహం మీరు కానప్పుడు శివుడి దేహం శివుడు అవుతాడా? మీ దేహం మీరు కానప్పుడు, కృష్ణుడి దేహం కృష్ణుడు అవుతాడా? నన్ను తెలుసుకోమని భగవంతుడు భగవద్గీతలో చెప్పినప్పుడు ఆయన దేహాన్ని తెలుసుకోమన్నాడా? ఆత్మను తెలుసుకోమన్నాడా? నేను ఆత్మను అని చెప్పాడా? నేను దేహాన్ని అని చెప్పాడా? భగవంతుడు వాసుదేవస్వామి. ఆత్మ శాశ్వతమైన వస్తువు, ఆత్మ నిజమైన వస్తువు. ఆ వస్తువును తెలుసుకునే వరకు మీకు సుఖం కలగదు. మీ సుఖం కోసం, మీ సంతోషం కోసం, మీ ఆనందం కోసం, మీ శాశ్వత శాంతి కోసం, మీ మోక్షం కోసం, మీ హృదయంలో నిత్యముగా, స్వయంగా ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకోమని పదే పదే భగవంతుడు వాసుదేవస్వామి గీతలో చెప్పాడు. మీకు చెప్పాడు, నాకు చెప్పాడు, మన అందరికి చెప్పాడు. మీలో ప్రతి ఒక్కరికి చెప్పాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఒక మతానికో, ఒక వ్యక్తికో, ఒక సమాజానికో, ఒక దేశానికో, ఒక రాష్ట్రానికో నచ్చేది కాదు. ఒక కులానికి సంబంధించిన మాటలు కాదు. భగవద్గీతలో చెప్పిన మాటలు త్రికాలములలో పనికి వస్తాయి. మరణం అనేది గొప్ప విశేషం ఏమి కాదు, మనం మరణించాం, మరణించాం అనుకుంటాం. మనం మరణించాం అంటే ఎవరు మరణిస్తారు? ఈ నేను నేను అని దేహానికి పరిమితం అయినది మరణించదు. దేహం మరణిస్తుంది. దేహాన్ని నేను అని చెప్పే నేను ఈ నేను స్మశానంలో బూడిద కాదు. మీరందరూ నేను నేను అంటున్నారు కదా, ఆ నేను అంటే ఎవరు? మనస్సు. మనస్సే నేను, ఆ మనస్సుని నేను నేను అంటున్నారు. ఆ నేను అందరూ మోస్తున్నారు.

భగవాన్ అన్నారు ప్రతీవాడు శవాన్ని మోస్తున్నాడు. ఈ దేహం ఒక శవం, బ్రతికుండగా, శరీరంలో ప్రాణం ఉండగా ఎవడి శవాన్ని వాడు మోసుకుంటున్నాడు. మరణించిన తరువాత దీనిని నలుగురు మోసుకు వెళ్తున్నారు స్మశానానికి. ఇప్పుడు ఇది శవమే, ఇప్పుడైతే నువ్వు మోసుకుంటున్నావు. ఎవడి దేహాన్ని వాడు మోసుకుంటున్నాడు. మరణించిన తరువాత నలుగురు మోసుకు వెళ్తున్నారు. అందరూ శవవాహకులే! మనం మరణించేటప్పుడు మనకు దుఃఖం వస్తుంది, కారణం? ఈ దేహం మనం అనుకుంటున్నాం కాబట్టి, ఈ దేహం పోతే మనం పోతున్నాం అనుకుంటున్నాం కాబట్టి మనకి దుఃఖం వస్తుంది, బాధ వస్తుంది. ఇది మనం కాదు అని తెలిసినప్పుడు అది మరణించినా మనకు దుఃఖం రాదు. దానితో

విడిపోయినప్పుడు మనకు దుఃఖం రాదు.

భగవాన్ స్కంధాశ్రమంలో ఉండగా భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చారు. ఆయన చాలా బీదవాడు. స్వామి నా దగ్గర ఏమీ పైసలులేవు. అందుచేత నీకు ఏమి తీసుకు రాలేదు. వట్టి చేతుల తోటి వచ్చాను అని చెప్పాడు. భగవాన్ అన్నారు ఏమి తీసుకురాలేదు, ఏమి తీసుకురాలేదు అంటావేమిటి అయ్యా, ఏమి తీసుకురాకపోవటం ఏమిటి? నేనుని తీసుకువచ్చావు కదా అన్నారు. నేను నేను అంటున్నావు కదా నువ్వు, ఆ నేనుని తీసుకు వచ్చావు కదా, నాకు కావల్సింది అదే. ఆ నేనుకి ఆత్మను తెలుసుకునే యోగ్యత, అర్హత, తగినటువంటి బలం పట్టించటానికే ఆయన ఇక్కడకు వచ్చాడు కాని, పళ్ళు తినడానికి వచ్చాడా? నేను ఏమి తీసుకు రాలేదు, నేను బీదవాడిని అంటున్నావు నువ్వు ఏమి తీసుకు రాకపోవడం ఏమిటి? నేనుని తీసుకు వచ్చావు. నేను నేను అంటున్నావు కదా, ఆ నేనుని తీసుకు వచ్చావు, అది చాలు.

మొట్టమొదట భగవాన్‌కి సేవ చేసింది పళనిస్వామి. పళనిస్వామిని భగవాన్ నీడ అని పిలుస్తారు. పళనిస్వామి భిక్షాటనకి వెళ్ళి ఏవో నాలుగు మెతుకులు తెచ్చేవాడు. భగవాన్ అనేవారు నువ్వు చాలా కష్టపడుతున్నావు. నా కోసం నువ్వు భిక్ష చేసి తీసుకు వస్తున్నావు. నువ్వు భిక్ష చేసుకువచ్చిన అన్నంలో నాకు వాటా పంచి పెడుతున్నావు. నువ్వు చాలా కష్ట పడుతున్నావు. అందుచేత నేనే స్వయంగా వెళ్లి భిక్ష చేసుకోవటం మంచిది. అందుచేత నువ్వు కష్టపడి తెచ్చిన దాంట్లో మళ్ళీ నాకు వాటా ఎందుకు? నేను ఇంటింటికి వెళ్లి భిక్ష తెచ్చుకోవటం మంచిది అని కొంతమంది ఇళ్లకు వెళ్ళేవారు. ఆయనేమి కంచం పట్టుకెళ్లలేదు. ఏమి గిన్నె పట్టుకెళ్ళేవారు కాదు, ఒక ఇంటికి వెళ్ళేవారు. ఇలా చప్పట్లు కొట్టేవారు. ఎవరైనా ఆ చేతులలో పెడితే ఆ చేతులలోది తినేవారు. మళ్ళీ చేతులు కడుక్కోవటం లేదు జుట్టుకు రాసుకునేవారు. అక్కడ నుండి వెళ్ళిపోతూ ఉండేవారు. అక్కడ ఉన్నవారు ఎవరైనా అనేవారు, దున్నపోతులాగా ఉన్నావు ఏమన్నా పని చేసుకోరాదా? అనేవారట. మీరు భిక్షకెళ్ళినప్పుడు నువ్వు దున్నపోతులా ఉన్నావు అని అన్నప్పుడు మీకు సిగ్గు వెయ్యలేదా అని ఎవరైనా ఆయనను అడిగితే, నాకేమి సిగ్గుగా లేదు. పెడితే తినేవాడిని, పొమ్మంటే పోయేవాడిని. కాని నాకు ఒక మహా చక్రవర్తి ఉన్నట్టే ఉండేది కాని, అవమానం నాకు ఎప్పుడు కలగలేదు అన్నారు. ఆయన దేహం మనకి దగ్గరగా ఉండవచ్చు, కాని ఆయనకు మనకు ఎంత దూరమో!

పరమ వైరాగ్య పురుషుడు పళని. ఆయన భగవాన్‌తో ఏమన్నారు అంటే మీ అమ్మ వచ్చారు, మీ అమ్మను బట్టి మిగతా స్త్రీలు కూడా రావచ్చు. అందుచేత మీరు ఉంటే స్కంధాశ్రమంలో ఉండండి, నేను మటుకు స్కంధాశ్రమం రాను అన్నాడు పళనిస్వామి. అనేకమంది స్త్రీలు వచ్చేవారు, పురుషులు వచ్చేవారు భగవాన్ తోటి మాట్లాడటానికి, కాని

పళని మటుకు స్కంధాశ్రమానికి వెళ్లేవాడు కాదు, భగవానే పళనిని చూడటానికి స్వయంగా విరూపాక్షగుహకు వచ్చేవారు. భగవాన్ పతనం అయిపోతున్నాడు అని పళని మనసులో ఊహించుకున్నాడు. పళనికి మరణించే రోజు దగ్గరకు వచ్చింది. ఇంకో నాలుగు రోజులలో పోతాడు అనగా ఎవరో చక్కటి మామిడిపండు తీసుకొచ్చి పళనికి ఇచ్చారు. ఈవాసనలు ఉన్నాయి చూసారా, ఈ కోరికలు మనల్ని పీడించేస్తాయి. మరణించేటప్పుడు కూడా మీరు ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది ఏమంటారు అంటే జాగ్రత్తగా ఉంటే మటుకు మరణం తప్పతుందా కావలసింది తినేయండి అంటారు. అది చాలా పొరపాటు అవుతుంది. మన శరీరంలో ప్రాణం ఉన్నంత సేపు జాగ్రత్తగా ఉండవలసిందే ఆహరం విషయంలో. మరణం రెండు రకాలు ఉంది. ఆరోగ్యంగా మరణించవచ్చు. అనారోగ్యంగా మరణించవచ్చు. మనం ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే ఆరోగ్యంగా మరణిస్తాం. ఆహారం విషయంలో జాగ్రత్తగా లేకపోతే విపరీతమైన శారీరక బాధల తోటి మరణిస్తాం. మనం చివరి క్షణం వరకు కూడా ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండవలసిందే. ఒక్క ఆహారం విషయంలోనే కాదు, ప్రతీ విషయంలో కూడా చివరి శ్వాస విడిచి పెట్టేవరకు జాగ్రత్తగా ఉండవలసిందే. ఇవాళ మీరు వచ్చి ఈ భగవాన్ మాటలు వింటున్నారు. నేను చెబుతున్నాను, నాకు ప్రాణం పోయేటప్పడు నాకు భగవాన్ జ్ఞాపకం రారు. బహుశా మీకు కూడా ప్రాణం పోయేటప్పడు భగవాన్ జ్ఞాపకం రారేమో, మనకు ఆరోగ్యంగా ఉన్నప్పడే భగవంతుడు జ్ఞాపకం రాకపోతే మరణించే టైములో జ్ఞాపకం వస్తాడు అని ఎక్కడ సిద్ధాంతం ఉంది? ఎక్కడా లేదు. దేహాన్ని విడిచిపెట్టి ప్రాణం బయటకు వెళ్లే టైములో ఎవరైతే నన్ను స్మరిస్తున్నారో వాళ్లకి నా స్వరూపం ఇస్తాను, వాళ్ళు నా స్వరూపాన్ని పొందుతారు అని గీతలో పరమాత్మ చెప్పాడు. కాని ప్రాణం పోయేటప్పడు మనం రామ, కృష్ణ, శివ, అరుణాచల అంటాం అని మీరు ఎవరు అనుకోకండి. ఏదో మాటకు అంటే అనచ్చును. కాని మన హృదయంతరాళల నుంచి మన ప్రాణం పోయే టైములో మటుకు అది బయటకి రాదు, భగవంతుడిని మనం స్మరించలేము.

మన మనస్సుని ఇప్పడే బాగుచేసుకోవాలి. ఈ రోజు మీరు బాగుచేసుకోకపోతే మరణం వచ్చే లోపులో బాగుచేసుకోవాలి. కాని మరణించే రోజున బాగుచేసుకోవటం చాలా కష్టం. దీపం ఉండగా చదువుకోలేని మనం దీపం ఆరిపోయిన తరువాత చదువుకోవటం అంటే చాలా కష్టం. మనం ఏది తప్పించుకున్నప్పటికీ మరణాన్ని తప్పించుకోలేము. భగవాన్ అనేవారు మరణం ఎవరికి? దేహానికి మరణం వస్తుంది. మీరు దేహం కాదు, దేహం మరణిస్తుంది. మీకు మరణం లేదు. నువ్వు ఆత్మవు, ఆత్మకు మరణం లేదు. స్వామి నాకు తరువాతజన్మ ఎటువంటిది వస్తుంది అని భగవాన్ ని అడిగితే తరువాతజన్మ ఎటువంటిజన్మ వస్తుంది అని అడుగుతున్నావు. ఇప్పడు నువ్వు పుట్టావా? ఇప్పడు నువ్వు పుడితే తర్వాతజన్మ గురించి

ఆలోచిద్దాం. ఇప్పుడు నువ్వు పుట్టావా? నీ దేహం పుట్టింది. ఆ దేహాన్ని నేను అనుకుంటున్నావు. అందుకే నేను పుట్టాను అనుకుంటున్నావు. ఇలా ఎన్ని శవాలను మోసుకెళతావు? ఏజన్మకాజన్మ శవాలను మోసుకుంటూ తిరగటమేనా, జ్ఞానం కోసం ప్రయత్నం చేయవా?

భగవాన్ చెప్పేవారు ఇక్కడకు వచ్చే వాళ్ళు నాస్తికులు ఆస్తికులు అవుతారు, ఆస్తికులు భక్తులు అవుతారు, భక్తులు జ్ఞానులు అవుతారు. ఎవరు వట్టిచేతులతోటి బయటకు వెళ్లరు. పరిణామ సిద్ధాంతంలో వాడు ఏ మెట్టులో ఉన్నాడో, మహాత్ముడి దర్శనం చేయటం వల్ల, ఒకొక్క మెట్టు పైకి వెళుతూ ఉంటాడు, నేను రామా, రామా అనుకుంటున్నాను. నేను కృష్ణా, కృష్ణా అనుకుంటున్నాను. రాముడికి జ్ఞానం ఉందా, కృష్ణుడికి జ్ఞానం ఉందా? వాళ్ళు జ్ఞానులేనా అని ఎవరో ఒక సందర్భంలో అడిగారు. అప్పుడు భగవాన్ అన్నారు ఎవరిని స్మరించుకోవటం వల్ల, ఎవరిని ధ్యానం చేయటం వల్ల, ఎవరిని జపించటం వల్ల మీకు జ్ఞానం కలుగుతుందో, వారు జ్ఞానం లేకుండా ఉన్నారా అనేవారు. వాసన ఎలా పీడిస్తుందో చెప్పడం కోసం చెబుతున్నాను, చిన్న కోరిక ఉంటే అది ఎలా పీడిస్తుందో చెబుతున్నాను.

ఇప్పుడు మీరు ఈ గీతాభవన్ లో భగవంతుడి గురించి వింటున్నారు. మరణించే టైములో మీకు ఈ శ్లోకాలు జ్ఞాపకం ఉండవు, ఈ దేవుడు జ్ఞాపకం ఉండడు. మరి ఏది జ్ఞాపకం వస్తుంది? మీరు జీవితం పొడవునా దేనిని ప్రేమించారో, మీ డబ్బు దేనికోసం ఖర్చు పెట్టుకున్నారో, మీ జీవితం పొడవునా దేనికోసంశ్రమించారో, రాత్రనక పగలనక దేనికోసం శ్రమించారో, దేనికోసం అయితే మీ శరీరాన్ని, మీ మనసుని, మీ ప్రాణాలని, మీబుద్ధిని, మీ శక్తిని, మీ యుక్తిని, దేనికోసం అర్పించారో, ఏ భావన కోసం అర్పించారో, అది నేను నేను అంటూ మీరు మరణించే టైములో మీ మెదడులోకి వచ్చి అదివాసన అయ్యి మీ మెదడుని ఆక్రమిస్తుంది, మీ మనస్సును ఆక్రమిస్తుంది, మీరు జీవితం పొడవునా పెంచి పోషించిన తలంపే, మీరు మరణించే టైములో వస్తుంది గాని ఈ రాముడు కాని, ఈ కృష్ణుడు కాని, ఈ దైవచింతన కాని, ఈ ఆత్మచింతన కాని రానే రాదు. వాటి అడ్రస్ కూడా మీకు తెలియదు.

మాకు భగవంతుడు అంటే ఇష్టం లేదా? మేము భగవంతుడిని ప్రేమించడం లేదా? మాకు భగవంతుడు అంటే భక్తి లేదా? లేకపోతే ఎందుకు వచ్చి ఇక్కడ కూర్చుంటాము? అలా అన్యాయంగా మాట్లాడకండి అని మీరు అనవచ్చు. మీరు అన్యాయంగా మాట్లాడకండి, అధర్మంగా మాట్లాడకండి. మేము భక్తులమే, మేము పూజిస్తున్నాము, మేము ఉపాసన చేస్తున్నాము. ఆరాధన చేస్తున్నాము, నదుల్లో మునుగుతున్నాం, జపాలు చేస్తున్నాం, ధ్యానాలు చేస్తున్నాం, సత్రాలు కట్టిస్తున్నాం, దేవుడు పేరు మీద అనేక మంచి పనులు చేస్తున్నాం, అయితే మాకు ఎవడికి దేవుడు జ్ఞాపకం రాడా? అంటే రాడు. ఎందుచేత అంటే మీకు దేవుడంటే ఇష్టం ఉన్న మాట నిజమే, మీ ఇష్టం చాలా కొద్దిపాటి ఇష్టం. ఒక పైసా వాటా ఇష్టం. మిగతా

తొంభై తొమ్మిది పైసలు లోకానికి ఇచ్చేశారు. ప్రాణం పోయే టైములో మనకి ప్రత్యక్షమయ్యేది భగవంతుడు కాదు లోకమే. మనం లోకం కోసం జన్మించాము. లోకం కోసం జీవిస్తున్నాం. లోకం కోసమే మరణిస్తున్నాం, దేనికోసం జీవితం పొడవునా జీవించామో, దేని కోసం మనం తాపత్రయ పడ్డామో, మనం మరణించే టైములో అదే వస్తుంది కాని మిగతా తలంపులు రావటానికి వీలు లేదు. ఏది నిగూఢంగా, పరమ రహస్యంగా నీ హృదయంలో దాక్కుని ఉందో, అది నువ్వు బయటకు చెప్పక పోవచ్చు కాని ఈశ్వర ప్రణాళిక ప్రకారం, ఈశ్వరుడి యొక్క ఆదేశం ప్రకారం, ఆ ఈశ్వరుడు ఆత్మ అయ్యి మీలో ఉన్నాడు కాబట్టి మీకు అత్యంత ప్రీతికరమైనటువంటి, మీకు nearest, dearest అయినటువంటి మీ ఆదర్శమో, మీ ఆశయమో, మీ అభిరుచో, మీ కోరికో, మీ వాసనో, మీ సంస్కారమో ఏదో ఒకటి నేను నేను అని మరణించే టైములో అది వస్తుంది కాని దేవుడు ఎవడు మీ బ్రెయిన్ లోకి రానే రాడు. అంతేకాదు ఇదంతా మీరు నమ్మకండి. మీ భక్తి తాత్కాలికం, ఏదో గోరువెచ్చని నీరు లాంటిది. అయితే మీకు కోరిక ఉంది. దేవుడిని తెలుసుకోవాలనే కోరిక ఉంది, మిమ్మల్ని మీరు తెలుసుకోవాలనే కోరిక ఉంది. మీకున్న ఇతర కోరికల తోటి పోల్చి చూస్తే, మీకున్న ఇతర వాంఛల తోటి కనుక పోల్చి చూస్తే ఇది అల్పాతి అల్పం, ఇది స్వల్పాతి స్వల్పం. ఆ కోరికల కన్నా ఇది తక్కువ. ఆ వాంఛల కన్నా ఇది తక్కువ, మీకు లోకం మీద ఉన్న ప్రేమ ముందు, లోకంలోని కోరికల ముందు ఇది బాగా స్వల్పాతి స్వల్పం, అతి పలుచగా ఉంటుంది కాబట్టి ఆ కోరిక వచ్చి ఈ కోరికను పక్కకి గెంటేస్తుంది. ఆ వాంఛ వచ్చి ఈ వాంఛని తగులబెడుతుంది. అందుచేత ఆ లోకవాసన, ఆ దేహవాసన, ఆ శాస్త్రవాసన, బంధువాసన, స్నేహవాసన, ఏదో ఒకటి ఈ లోకానికి సంబంధించినవాసన వచ్చి, మీ బుర్రను ఆక్రమించి ప్రాణం పోయేటప్పుడు అదే మిమ్మల్ని పట్టుకుని పీడిస్తుంది కాని దేవుడు మీకు జ్ఞాపకం రాడు. దేవుడిని మీరు స్మరించలేరు.

మీరు దేవుడిని ఎప్పుడైనా ప్రేమించారా, ? ఆ ప్రేమలో మీ దేహాన్ని మర్చిపోయారా? మీ అహంకారాన్ని మర్చిపోయారా? మీకు దేవుడు మీద ప్రేమ ఉంది కాని మీ దేహం కంటే అది ఎక్కువ కాదు. మీ దేహం మీద మీకు ఎంత ప్రేమ ఉందో, అంతకంటే బహు తక్కువ ఉంది మీకు దేవుడు మీద ఉన్న ప్రేమ, మీ ఇంట్లో ఉన్న వ్యక్తుల మీద, వస్తువుల మీద ఉన్న ప్రేమ కూడా మీకు దేవుడి మీద లేదు. ఎంతో కొంత ప్రేమ ఉంది కాని అది బహు స్వల్పాతి స్వల్పం. ఎప్పుడైనా దేవుడిని తెలుసుకుందాం అని ప్రయత్నం చేసినప్పటికీ మనకు దుష్ట సాంగత్యం వల్ల అది ఆరిపోతుంది, అది రాలిపోతుంది. దేవుడిని తెలుసుకోవాలి అనే కాంక్ష మనకు ఎంతో స్పష్టంగా ఉంటేనే గాని పెరగదు. దుష్ట సహవాసం వల్ల, దుర్వాసనల వల్ల అది ఎప్పుడో రాలిపోతుంది. అది అణగారిపోతుంది. ఏది? భగవంతుడిని తెలుసుకోవాలి అనే కాంక్ష

సోదరమహాశయులారా! మనం మాయని జయించటం చాలా కష్టం. నా మాయని

ఎవరు జయించలేరు, అందుచేత నన్ను ఆశ్రయించండి అని భగవంతుడు చెప్పాడు. భగవంతుడికి ఒకొక్కసారి సిగ్గులేదా అనిపిస్తుంది. నన్ను నమ్మండి, నన్ను విశ్వసించండి, నన్ను భజించండి అని ఆయనంతట ఆయనే చెప్పేసుకుంటున్నాడు మనకి, ఎందుచేత అంటే ఆయన అంతట ఆయన చెప్పకోకపోతే, ఆయన గురించి ఆయన చెప్పకపోతే మనకు ఎలా తెలుస్తుంది? ఆయన గొప్ప కోసం చెప్పలేదు. ఆయన గురించి ఆయన చెప్పకోకపోతే మనకు తెలియదు కాబట్టి ఆయన గురించి ఆయన చెప్పకున్నాడు. ఆయన ఎంతటి వాడో ఆయనే చెప్పాలి. ఆయన ఎంతటి వాడో ఆయన చెప్పకోకపోతే ఎవరు చెప్పగలరు ఆయన గురించి? సర్వసాధారణంగా దేవుడి దగ్గరకి గుళ్ళోకి వెళ్లి మన మనసులో ఏముందో అదే అడుగుతూ ఉంటాం, నాకు అది కావాలి, ఇది కావాలి, అని అడుగుతూ ఉంటాం. మన ఉద్దేశ్యం ఏమిటి? మనం అడగకపోతే ఆయనకు తెలియదు అని. బయట ఉన్న దేవుడికి తెలియక పోవచ్చు, మీ హృదయంలో ఉన్న దేవుడికి తెలియదా? బయట ఉన్న దేవుడికి మీరు కళ్ళు మూయవచ్చు, మీ హృదయంలో ఉన్న దేవుడికి మీరు కళ్ళు ఎలా మూయగలరు? మీలో ఉన్న విషయం మీకు తలంపు వస్తేనే తెలుస్తుంది. మీకు తలంపు రాకముందే ఆయనకు తెలుసు మీ హృదయంలో ఏముందో వాడు దేవుడంటే!

మాయ ఎలా కమ్మేస్తుంది అంటే పళని రమణస్వామి దగ్గరకు వచ్చాడు, రమణస్వామిని దేవుడు అని నమ్మాడు, గురువని నమ్మాడు. అరుణాచలేశ్వరుడే శరీర రూపం ధరించి వచ్చాడు అని నమ్మాడు. అటువంటి పళనికి, ఇంకొక నాలుగు రోజులలో శరీరంలో ప్రాణం విడిచి పెడతాడు అనగా, ఎవరో చక్కటి మామిడిపండు తీసుకొచ్చి ఇచ్చారు. అంత బ్రహ్మచారి, అంత ఇంద్రియ నిగ్రహం కలవాడు, ఆ మామిడిపండు తిందామని శుభ్రంగా కడుగుకున్నాడు. అది తింటే ఆయనకి దేహం యొక్క రోగం పెరుగుతుంది, ఆయనకు తినాలని ఉంది. ఆ మామిడిపండు కడుగుకున్నాడు. తిందాం అనుకుంటున్నాడు. అక్కడ ఎవరూ లేరు, ఎవరు చూడకపోయినా ఈశ్వరుడు చూస్తూనే ఉంటాడు. ఆ మామిడిపండు తినాలని ఉంది ఈ లోపులో భగవాన్ వచ్చే చప్పడు వినబడింది. భగవాన్ వస్తున్నట్టు పళని చూశాడు, చూసిన వెంటనే మామిడిపండు దాచేశాడు. ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే మాయ ఎలా కమ్మేస్తుందో చూడండి. ఆయన ఎటువంటి మహాత్ముడో తెలుసు. సంవత్సరాల తరబడి

**ఎవరి మనస్సు అయితే రాగద్వేషాలకి అతీతంగా, ఇష్టాయిష్టాలకి అతీతంగా సమానస్థితిలో ఉందో, వాడు మాత్రమే బ్రాహ్మీస్థితిని పొందుతాడు.**



సంవత్సరాల తరబడి ఆయనకి స్నానం చేయించి, ఆయన ఒంటి మీద ఉన్న దుమ్ముని ఎత్తి పోశాడు. భగవాన్ వస్తున్నారు, భగవాన్ ఎదురుగా తినడం న్యాయం కాదు అని ఈ మామిడిపండు గూట్లో దాచేసుకున్నాడు. కోరిక ఏవిధంగా అయినా సరే కళ్ళు మూసేస్తుంది. ఆయన పరమేశ్వరుడు అని తెలుసు, తెలుసున్నప్పటికీ ఆ క్షణంలో మాయ కమ్మేస్తుంది. అంత సాధన చేసినవాడు, అంత వైరాగ్యమూర్తివంటి వాడికి ఈ మామిడిపండు తినాలనే కోరిక కలిగింది. భగవాన్ వచ్చి కూర్చొన్నారు. ఈ మామిడిపండు భగవాన్ కళ్లకు కనపడకుండా మారుమూల దాచేశాడు. భగవాన్ వచ్చారు, కూర్చొన్నారు. పళని బాగున్నావా, ఏమి చేస్తున్నావు, ఎలా ఉంది నీకు ఆరోగ్యం బాగుందా? అని అడుగుతున్నారు, పళని చెబుతున్నాడు. ఇద్దరి దేహాలు దగ్గరే ఉన్నాయి. ఎదురుగా ఉన్నవాడు ఈశ్వరుడు. పళని మనసు మటుకు మామిడిపండు మీదకి పోతోంది, ఇప్పుడు మీ దేహం నా దేహం దగ్గర ఉండవచ్చు. కాని మీ మనస్సు ఎక్కడో ఉండవచ్చు. నా మనస్సు ఎక్కడో ఉండవచ్చు. దేహాలు దగ్గరగా ఉన్నప్పటికీ మనసులు దూరంగా ఉంటే దూరంగా ఉన్నట్టే లెక్క. ఎక్కడైతే దేహం ఉందో అక్కడ మనసు ఉండాలి, ఒకొక్కసారి మన దేహం ఇంటికాడ ఉంటుంది. మన మనసు సినిమాల వెంట పోతూ ఉంటుంది. అప్పుడు గాంధీ గారు ఒక సూత్రం చెప్పారు, నీ మనస్సు పోతే పోనీ, దానికూడా నీ దేహాన్ని మటుకు పంపకు. దాని కూడా నువ్వు పరుగెట్టకు, దాని కూడా నువ్వుపరుగెట్టావా, అక్కడే పతనం అయిపోతావు. భగవాన్ “పళని ఇక్కడ మామిడిపండు వాసన వస్తోంది” అన్నారు. అప్పుడు కూడా చెప్పటానికి ఈయన అంగీకరించటం లేదు. ఏమోస్వామి ఎక్కడ నుంచి వస్తుందో తెలియటం లేదు? మామిడిపండు వాసన వస్తోందా? మరి వాసన వస్తుంటే ఎక్కడో ఉండి ఉండాలి మామిడిపండు, ఇక్కడ లేకపోతే వాసన ఎలా వస్తుంది? ఏమోస్వామి ఎక్కడ నుంచి వస్తోందో అని ఆయనని ఏమార్చటం కోసం, ఆయనని మరపించటం కోసం చూస్తున్నాడు. ఈ రమణస్వామి ఒక రాక్షసుడు, పోనీ వెళ్లిపోవచ్చు కదా చూసి చూడనట్టు. ఈయన నటిస్తున్నాడు ఆ మామిడిపండు ఎక్కడ ఉందో ఆయనకు తెలుసు. అది ఎక్కడ ఉంది, ఎక్కడ ఉంది అని గదిలో వెతుకుతున్నాడు. మొత్తం మీద వెతికి పట్టుకున్నాడు. ఆ పళని ఎదురుగుండా ఆపండులోని రసం అంతా తాగి, ఆ టెంక పూర్తిగా నాకేసి, అది బయట పడేశాడు. ఎందుకు భగవాన్‌కి మామిడిపండు కావాలి అని కాదు, తాను విడిచి పెట్టి వెళ్ళిపోతే వీడు తినేస్తాడు. వీడి రోగం పెరుగుతుంది, దానిని తినవద్దని చెప్పినా మానడు. అందుకే మామిడిపండు తినేసి, టెంక నాకేసి, పళని ఎదురుగానే అది బయట పడేసి వెళ్ళిపోయారు.

ఈవాసనలు అన్నీ నేను ఉంటేవాసన, నేను ఉంటె ఆలోచన, నేనుఉంటే తలంపు, నేను ఉంటే కోరిక, ఇవి అన్నీ నేను ఉంటే వచ్చాయా? నేను లేకుండా వచ్చాయా? మన

హృదయంలో కోరిక వస్తుంది, కోరిక ఎవరికి వస్తుంది? నాకు వస్తుంది, నేను ఎవరు? నాకు దుఃఖం వస్తుంది, ఎవరికి వస్తుంది దుఃఖం? నాకు వస్తుంది. మరి ఈ నేను అనేది ఎవరు? ఆత్మ నేను అనదు, ఈ దేహం నేను అంటుంది. మరి ఈ నేను నేను అంటున్నావు, ఈ నేను ఎవరు? జీవితం పొడవునా ఈ నేనుకి పాలేరుతనం చెయ్యటమే సరిపోతుంది మనకి. ఈ నేనుకి పెద్ద నౌకరులం మనమందరం. ఈ నేను యొక్క మూలాన్ని తెలుసుకోకుండా ఎవడు జ్ఞాని కాలేడు. మనం అందరం నేను నేను అంటున్నాం, ఈ నేను లోపల నుంచి వస్తోందా? నేను అనే భావన, బయట నుంచి వస్తోందా? ఏమండీ ఏమి మొహమాటం పడకండి, ఈ నేను నేను అని అంటున్నాము, ఈ నేను అనే భావన, ఈ నేను అనే తలంపు, బయట నుంచి వస్తోందా? లేకపోతే లోపల నుంచి వస్తోందా? మీరు చెప్పండి. ఇది లోపల నుంచే వస్తోంది. ఎక్కడ నుంచో బయట నుంచి రావటం లేదు. అందరికి లోపల నుంచే వస్తుంది, మరి బయట ఎందుకు వెతుకుతున్నారు దేవుడిని? లోపల వెతకటం చేతకాక బయట వెతుకుతున్నాం. ఇలా ఎన్నిజన్మలు వెతికినా ఇంతే, మన స్వరూపం తెలియదు.

మీ మనస్సుని ఎవడైతే లోపలకి పంపించ గలుగుతున్నాడో వాడే గురువు, మనస్సుని ఎవడైతే అంతర్ముఖం చేయగలుగుతున్నాడో వాడే గురువు. ఎన్ని శాస్త్రాలు చెప్పినప్పటికీ నీ మనస్సును అంతర్ముఖం చేయలేకపోతే వాడు గురువు కాదు, రాక్షసుడు. ధ్యానం చేస్తున్నప్పడు నాకు ఆ తలంపులు వస్తున్నాయి, ఈ తలంపులు వస్తున్నాయి అని భగవాన్‌తో చెప్పారు, వస్తే రానియ్యి, ఫరవాలేదు లోపల ఉన్నాయి కాబట్టి వస్తున్నాయి. మనం ఏదైనా నొక్కితేనే కక్కుతుంది, ధ్యానం చెయ్యటం అంటే ఏమిటి మనసును పిండటం. ధ్యానం చేసేది మనస్సే కదా, మనం ఏదైనా ఒక వస్తువు మీద ధ్యానం చేసేటప్పడు మిగతా కోరికలు అన్నీ కూడా నా మాట ఏమిటి, నా మాట ఏమిటి అని వస్తూ ఉంటాయి. అందుచేత అవి రావటం కూడా మంచిదే, మనలో ఉన్నాయి కాబట్టి వస్తున్నాయి. వస్తేనే కాని మనకి తెలియదు. ఏ తలంపు అయితే మీకు అతిగా వస్తుందో, మీరు కోరకుండా ఏ తలంపు అయితే ఎక్కువ వస్తుందో, మీకు సదా ఏ విషయం ఎక్కువ జ్ఞాపకం వస్తుందో, ఆ తలంపు గురించి, ఆ విషయం గురించి మీరు పూర్వజన్మలో ఎక్కువ ఇష్టపడి పనిచేసినట్టు గుర్తు. అప్పడు ఇష్టపడి తెచ్చి పెట్టుకున్నారు. ఇష్టపడి అప్పడు సాధన చేశారు. ఇవాళ అది కష్టం తెస్తుంది, కష్టం తెస్తుందని పొమ్మంటే అది పోతుందా? ఎంత బలంగా అయితే మేకు గోడ లోపలకి కొట్టానో, అంత బలంగా బయటికి లాగితేనే వస్తుంది. అదే విధంగా మీరు ఎంత ఇష్టం తోటి కోరికను పెంచుకున్నారో, ఎంత ఇష్టం తోటి మీరువాసనను పెంచుకున్నారో, అంతకంటే రెట్టింపు బలం తోటి మీరు సాధన చేసి దానిని తొలగించు కోవటానికి ప్రయత్నం చేసినప్పడే అది బయటకి వెళుతుంది కాని తొందరగా ఖాళీ చెయ్యదు. మనం బలవంతంగా విడిచి పెడితే మన కూడా వెంటాడుతుంది.

భగవాన్‌లో గొప్ప విశేషం ఏమిటి అంటే ఆయన అందరినీ సమానంగా చూసేవారు. ఆయన తల్లిని ఎలా చూసేవాడో అలాగే ఇతర స్త్రీలను, పురుషులను అందరిని సమానంగా చూసేవాడు. నేను రమణస్వామి తల్లిని, వీడిజన్మకు నేను కారకురాలిని, వీడు నన్ను అందరి కంటే ఎక్కువ చూడటం లేదు, అందరితో పాటు సమానంగా చూస్తున్నాడు అని ఆయన తల్లి చాటుగా ఎల్లమ్మ తోటి, పుల్లమ్మ తోటి చెప్పి ఏడ్చేది. అప్పుడు మీబోటి వాళ్ళు వెళ్లి స్వామి, స్వామి మీ అమ్మను మీరు ఎక్కువ గౌరవించటం లేదు, మీ అమ్మని మీరు ఎక్కువగా ఆప్యాయంగా చూడటం లేదు, మీ అమ్మగారు ఏడుస్తున్నారు అని భగవాన్‌తో చెబితే భగవాన్ అన్నారట మా అమ్మ ఏడుస్తోందా, ఏడవటం ఎంతో మంచిది, లోపల ఎంత ఏడుపు ఉంటే అంత బయటకి వచ్చేయటం మంచిది. చచ్చిపోయేటప్పుడు చివరకు ఈ ఏడుపు మిగల కూడదు, ఈ ఏడుపు అంతా పోతే, దుఃఖం అంతా పోతే,వాసన అంతా పోతే, ఆ రోదన అంతా పోతే ఆనందం వస్తుంది. ఏవండీ ఈ అరుగుని శుభ్రం చేయమంటాం అనుకోండి, శుభ్రత రాజోలు వెళ్లి కొనుక్కోస్తారా? కొనుక్కురారు. చీపురు పెట్టి తుడిచేస్తే శుభ్రత ఇక్కడే ఉంది. అదే విధంగా నీలో ఉన్న దుఃఖాన్ని తీసేయ్, ఆనందం నీ లోపలే ఉంది.

మనం ఇల్లు మారుతున్నాము అనుకోండి ఇల్లు మార్చేటపుడు సగం సామాను వదిలేస్తామా? మొత్తం సామాను కొత్త ఇంటికి పట్టుకు పోతామా? చీపురు కట్ట కూడా విడిచి పెట్టము. అదే విధంగా మన ప్రాణ ప్రయాణ టైములో మనకి తెలిసి, తెలియక మనం చేసిన పనులు, మనకు వచ్చిన తలంపులు అన్నిటికి మనం సమాధానం చెప్పాలి. మనకు ఏదైనా ఒక చెడు తలంపు వచ్చింది అనుకోండి దానికి మనం సమాధానం చెప్పాలి. మనకేదో మంచి తలంపు వచ్చింది అనుకోండి దానికి మనం సమాధానం చెప్పాలి. మనం ఏదైనా చెడ్డ పని చేశాము అనుకోండి దానికి మనం సమాధానం చెప్పాలి. ఏదైనా మంచి పని చేశాము అనుకోండి దానికి సమాధానం చెప్పాలి. మనం చేసే ప్రతీ పనికి ఈరోజు కాకపోయినా మరొక రోజున, ఈజన్మలో కాకపోయినా మరొకజన్మలో, ఈ కాలంలో కాకపోయినా మరొక కాలంలో మనం సమాధానం చెప్పి తీరాలి. ఒక మహాత్ముడు చెప్పాడు మనం నాలుగు ఆవులను అక్కడ కట్టేసి, ఒక దూడను విడిచి పెట్టేస్తే, నాలుగు ఆవులు దగ్గరకి ఆ దూడ వెళ్ళదు, ఆ దూడ ఏ ఆవు బిడ్డో సరిగ్గా ఆ ఆవు దగ్గరికే వెళ్లి పాలు కుడుచుకుంటుంది, అదే విధంగా నువ్వు ఏజన్మలోకి వెళ్లినప్పటికీ, ఏ లోకంలోకి వెళ్లినప్పటికీ, నువ్వు ఏ పరిస్థితిలో ఉన్నప్పటికీ, నువ్వు చేసిన పని నిన్ను వెంటాడి వెంటాడి, తన తల్లి దగ్గరకే దూడ వెళ్లినట్టుగా నువ్వు చేసిన కర్మ యొక్క అనుభవం నువ్వు పొందవలసిందే. అది మీకు అనుభవంలోకి వచ్చే వరకు అది మిమ్మల్ని విడిచి పెట్టదు. దానినిపరిష్కరించే వరకు మిమ్మల్ని విడిచి పెట్టదు.

మనం ఏదైనా తలంపు వస్తే పని చేస్తామా? తలంపు రాకుండానే పని చేస్తామా?

బాగా ఆలోచించండి. మీరు రాజోలు నుంచి ఇక్కడకు వచ్చారు అనుకోండి, రాజోలు నుంచి సఖినేటిపల్లి గీతా భవనానికి వెళ్ళాలి అని అనుకుని వచ్చారా? అనుకోకుండా శరీరం ఇక్కడకు వచ్చేసిందా? ముందు తలంపు వస్తుంది, తరువాత పని చేస్తారు. తలంపు ఎక్కడ నుంచి వస్తుంది? బయట నుంచి వస్తుందా? లోపల నుంచి వస్తుందా? మీకు ఒకరకమైన తలంపు వస్తుంది, నాకు ఒక రకమైన తలంపు వస్తుంది. తలంపు ఎక్కడ నుంచి వస్తుంది? వాసన లోంచి వస్తుంది. ఇక్కడ మామిడిపండు ఉంటే మామిడిపండు వాసన వస్తుంది. సపోటాపండు ఉంటే సపోటాపండు వాసన వస్తుంది. అదే విధంగా మీ హృదయంలో ఏ వాసన అయితే ఉందో ఆవాసనకు అనుగుణంగా మీకు తలంపు వస్తుంది. అయితే మీ లోపల ఏ వాసన ఉందో మీకే తెలియదు తలంపు వచ్చే వరకు, ఏవండీ, ఆవాసన ఎలా వచ్చేసింది? ఆవాసనని మనమే పెంచుకున్నాము. మనమే పోషించు కున్నాము. ఆవాసనలు మన కూడా వస్తూ ఉంటాయి. దేహం మరణించినపుడు ఆవాసనలు మరణించవు. మన కూడా ప్రయాణం చేస్తూనే ఉంటాయి. మనం మరణించే టైములో, మనం చేసిన చేష్టలు, మనకున్న ఊహలు, మనకున్న సంస్కారాలు, ఇవన్నీ మూట కట్టినట్టు మీ మనసు ఏమి చేస్తుంది అంటే ఒక్కో తలంపు ఒక్కో తలంపు ఒక్కో తలంపు ఇంట్లో సామాను సర్దుకున్నట్టు అన్ని తలంపులను లాక్కునేవరకు శరీరం ఎంత బాధ పడుతున్నప్పటికీ ఈ శరీరంనుండి ప్రాణం పోదు. డ్రైవరుకు తొందరగా ఉంది అనుకోండి వెళ్ళిపోవాలని, కాని గార్డు జెండా ఊపాలి కదా, గార్డు జెండా ఊపకుండా డ్రైవరుకు రైలు కదపటానికి వీలు లేదు. ఈవాసనలని, ఈ సంస్కారాలని, శరీరం విడిచి పెట్టేసి వెళ్ళేముందు అన్ని పోగు చేసుకున్న తరువాత నేను సిద్ధమయ్యి పోయాను అని చెప్పిన తరువాత అప్పుడు జెండా ఊపిన తరువాత అప్పుడు శరీరంనుండి ప్రాణం బయటకి తప్పకుంటుంది.

సోదరమహాశయులారా! భగవంతుడు వాసుదేవుడు ఏమని చెప్పాడు అంటే నువ్వు ఎంతో పెద్ద మనిషి అని నువ్వు అనుకోవచ్చు అది కాదు ప్రధానం. చివరి మినిట్‌లో ఈ శరీరాన్ని విడిచి పెట్టి ప్రాణం పోయే టైములో ఆ చివరి శ్వాసలో అప్పుడు ఏ తలంపు అయితే మీ బుర్రలో ఉందో, ఆ తలంపుని బట్టి మీకు తర్వాతి జన్మ వస్తుంది కాని నువ్వు అనుకునే రామ రామలు, కృష్ణ కృష్ణలు అప్పుడు నిలబడవయ్యా పుల్లయ్యా, చేసుకోవద్దు అని కాదు. ఈ శవాన్ని విడిచి పెట్టి ఆ ప్రాణం తప్పకునే టైములో, అప్పుడు మీకు ఏ తలంపు అయితే ఉందో, ఆ తలంపుకి అనుగుణంగా చెడు తలంపు ఉంటే చెడు తలంపు, మంచి తలంపు ఉంటే మంచి తలంపు, ఆ తలంపుకి అనుగుణంగా మీకు తరువాతి జన్మ వస్తుంది కాని, ఇప్పుడు తలంపుని బట్టి రాదు అన్నాడు. అయితే ఇంకో గంట ఉన్నాక నాకు ఏ తలంపు వస్తుందో చెప్పలేని నేను నాకు మరణించే టైములో ఏ తలంపు వస్తుందో నేను చెప్పగలనా? ఇక్కడ చెప్పేవారు ఎవరైనా

ఉన్నారా? ఇక్కడ మహా మేధావులు ఉండవచ్చు, సైంటిస్ట్ ఉండవచ్చు, పండితుడు ఉండవచ్చు, ఈ సృష్టిలో ఎవడైనా సరే నాకు ప్రాణం పోయే టైములో ఫలానా తలంపే వస్తుంది అని ఎవరైనా చెప్పగలరా? ఆ వచ్చే తలంపు వీడి కంట్రోల్ లో అసలు ఉందా? నా ప్రాణం ఎప్పుడు పోతుందో నాకే తెలియనప్పుడు ఇంక అప్పుడు తలంపు ఏమి వస్తుందో నాకేమి తెలుస్తుంది? సైంటిస్టును చెప్పమనండి, ఒక ఫిలాసఫర్‌ను చెప్పమనండి, ఒక పండితుడిని చెప్పమనండి, ఎవడూ చెప్పలేడు. కాని ఆ తలంపు మటుకు మీ future birthని డిసైడ్ చేస్తుంది. దానికి తిరుగు లేదు, పైగా ఆ తలంపు ఎటువంటిది అంటే ఏదైతే బలీయంగా ఉందో, ఏ తలంపు కోసం మీరు విశేషంగా జీవించారో, దేని కోసం అయితే పని చేశారో, దేని కోసం అయితే మీ జీవితాన్ని అంతా వెచ్చించారో, ఆ తలంపు మటుకే ప్రాణం పోయే టైములో అది వస్తుంది. దాన్ని బట్టి మీకు తరువాతి జన్మ నిర్ణయించబడుతుంది. ఇది కాదు అనటానికి వీలు లేని సత్యం.

మీకు నిజం అంటే ఇష్టం లేకపోవచ్చు. మనం నమ్మేవి అన్నీ నిజాలు కావు. కాని నిజాన్ని మనం నమ్మాలి. మోక్షం మోక్షం అంటే ఏమి లేదు. వాసనా క్షయమే మోక్షం. మోక్షం కోసం మనం మరణించే వరకూ ఉండక్కర్లేదు. మోక్షానికి, మరణానికి సంబంధం లేదు. ఇప్పుడే, ఇక్కడే మీరు మోక్షం పొందవచ్చు. జ్ఞానమే మోక్షం. దానిని సంపాదించటం కోసమే మనం జీవితం అంతా ఖర్చు పెట్టాలి. మీరు పూజ చేయండి, లేకపోతే జపాలు చేయండి, లేకపోతే విచారణ చేయండి, లేకపోతే ధ్యానాలు చేయండి, మీ గమ్యం మటుకు జ్ఞానమే. మనల్ని మనమే వెతుకు కుంటున్నాం కాని దేవుడి కోసం వెతుకుతున్నాం అనుకుంటున్నాం. మన కేంద్రం మనమే, మన గమ్యం మనమే, మన కోసమే మనమే ప్రయత్నాలు చేసుకుంటున్నాము. గణపతిశాస్త్రి గారు మహా పండితుడు, ఆయన భగవాన్ దగ్గరకు వచ్చి నేను చదవవలసిన పుస్తకాలు అన్నీ చదివాను. ఎన్నో శాస్త్రాలు చదివాను. నేను ఇంక చదవటానికి పుస్తకాలు అంటూ ఏమి లేవు. నేను చదవవలసిన శాస్త్రం అంటూ ఏమి లేదు. కాని ఈ నాటికి కూడా ఇంత సాధన చేసిన తరువాత కూడా ఆ నేను అంటే నాకు తెలియటం లేదు. తపస్సు అంటే ఏమిటో నాకు తెలియటం లేదు అన్నారు. భగవాన్ చెప్పేవారు అందరూ గజ ఈతగాళ్లే ఎవరు గజం కదలటం లేదు అని. మనం చేసే సాధనలు కూడా ఇంతే!

మనం అణా విలువ సాధన చేస్తే రూపాయి విలువ అహంకారం వస్తోంది. కొంతమంది చెబుతూ ఉంటారు ఏమండీ నేను తెల్లారగట్ల మూడు గంటలకే లేచిపోతున్నాను. రెండేసి గంటలు, మూడేసి గంటలు జపం చేస్తున్నాను. పూజ చేస్తున్నాను. మీరు పూజ చేస్తుంటే ఎదుటి వాడికి ఎందుకు తెలియాలి అసలు? అది కాదండి మీరు పూజ చేసుకుంటున్నారు, ఎదుటి వాడికి ఎందుకు తెలియాలి మీరు చేసుకునే పూజ? భగవాన్ ఒక మాట చెప్పారు.

ఒక దొంగవాడు మన ఇంటికి వచ్చాడు అనుకోండి మన ఇంటికాడ ఒక వస్తువు పట్టుకుపోయాడు. ఈ యజమాని ఏమి చేశాడు అంటే మరుసటి రోజున ఆ వస్తువు తీసుకెళ్లిన వాడినే అడిగాడు? ఏమయ్యా రాత్రి మా ఇంటికి ఎవడో దొంగవాడు వచ్చాడు. మెడలో గొలుసు పట్టుకుపోయాడు. పోలీసు complaint పెడదాం అనుకుంటున్నాను అని చెప్పాడట. ఎవరికి? దొంగవాడికే చెప్పాడు. అతనే దొంగని వీడికి తెలియదు. వాడు అన్నాడట ఏమయ్యా నీకు మతి లేదు ఏమిటి? పోలీసు వారు సరిగ్గా వెతుకుతారు ఏమిటి? మీరు మాట్లాడకుండా ఊరుకోండి, నేను ఆ వస్తువు కోసం వెతుకుతాను అన్నాడట. ఒక పది రోజులు చూశాడు, ఏమయ్యా ఏమైనా enquiry చేస్తున్నావా? నేను enquiry చేస్తున్నాను అన్నాడు. నిజంగా వీడు చేస్తున్నాడా? చేయటం లేదు. ఎందుకంటే వాడే దొంగ. మన మనసుతోటి చేసే సాధనలు ఇలాగే ఉన్నాయి అన్నారు భగవాన్. ఈ మనస్సే దొంగ, అగ్నికి అగ్ని తోడైతే పేలుతుంది. అదే విధంగా ఈ మనసుకి మనసు తోడు అయితే, అహంకారానికి అహంకారం తోడైతే అది పేలుతుంది. చాలామంది సాధన పేరు తోటి అహంకారం పెంచుకుంటున్నారు. సాధన చేస్తున్నాం, సాధన చేస్తున్నాం అంటున్నారు. కాని సాధన పేరు మీద, ఈ జపాలు పేరు మీద, అహంకారాన్ని పెంచుకుంటున్నారు.

మీరందరూ జపాలు చేస్తున్నారు, ఆ జపం చేసే జపి ఎవరు? ఆలోచించండి, జపం చేస్తున్నారు, జపం చేసేవాడు లోపల ఒకడు ఉన్నాడా? ఎవడు లేకుండా చేసేస్తున్నారా, మీరు రామ, రామ అంటున్నారు. లేకపోతే యేసు యేసు అంటున్నారు. లేకపోతే కృష్ణ కృష్ణ అంటున్నారు. లేకపోతే శివ శివ అంటున్నారు. ఈ జపాన్ని ఎవరో ఒకరు చేస్తున్నారు. లోపల ఎవడో ఉండి చేస్తున్నాడా? ఆ చేసేవాడు ఎవడు? వాడు అంటాడట నువ్వు జపం చేసుకో, నువ్వు పూజ చేసుకో, నువ్వు ధ్యానాలు చేసుకో, నువ్వు పుణ్యాలు చేసుకో, సత్రాలు కట్టించుకో, నువ్వు దానాలు చేసుకో, ధర్మాలు చేసుకో, అన్నీ చేసుకో కాని నా జోలికి మటుకు నువ్వు రాకు. నువ్వు పుణ్యాలు చేసుకో, మంచి లోకాలకు వెళ్ళు, మంచిజన్మలు సంపాదించు, మంచి గౌరవాలు సంపాదించు, కాని నా జోలికి మటుకు రాకు అని చెపుతాడు. ఏమండీ, ఏ మనిషి అయినా తనని తాను చంపుకోడానికి ఇష్టపడతాడా? మనం చేసే ప్రయత్నాలు, మనం చేసే సాధనలు ఎలా ఉంటాయి అంటే ఒక గానుగెద్దు అబ్బో చాలాదూరం వచ్చేశాం అని అనుకుంటుంది. ఎప్పటి వరకు అంటే తన కళ్ళకు కట్టిన గంతను విప్పేవరకు. తీరా ఆగంత విప్పేస్తే అది ఉన్నచోటే ఉంటుంది. మనం చేసే సాధనలు అలాగే ఉంటాయి. మీరు ధ్యానం చేయండి, జపం చేయండి, మనసు అణుగుతుంది. మనసు యొక్క మూలం తెలుసుకునే వరకు అది నిన్ను విడిచి పెట్టదు. అందుచేత దాని మూలాన్ని తెలుసుకోటానికి ప్రయత్నం చెయ్యి, దానిని విచారణ చెయ్యి, విచారణ చేస్తేనే కాని అది నాశనం కాదు. అయితే పూజ

వల్ల, జపం చేయటం వల్ల ఫలితం లేదా? అంటే ఫలితం ఉంది, అది ఊరికే అణిగి ఉంటుంది. నాశనం కాదు. మీరు జపాలు చేయండి, జపాలు వద్దు అనటం లేదు కాని జపం చేసేవాడు లోపల ఉన్నాడు. ఆ జపం చేసే జపి ఎవరు? అది విచారణ చెయ్యండి.

పుస్తకాలు చదివితే పాండిత్యం వస్తుంది, పుస్తకం మీకు బయట ఉందా? లోపల ఉందా? మనకి బయటే ఉంది, ఏవండీ ఆత్మ ఎక్కడుంది? లోపల ఉంది. మరి లోపల ఉన్న ఆత్మను పుస్తకంలో వెతుకుతావు అనుకో, పుస్తకంలో దొరుకుతుందా నీకు? భగవాన్‌ని ఏమి అనేవారు అంటే బ్రాహ్మణస్వామి అని పిలుస్తూ ఉండేవారు. రామకృష్ణ పరమహంస అంతటి వాడిని పట్టుకుని పిచ్చివాడు, పిచ్చివాడు అన్నారు. రామకృష్ణ పరమహంస చెప్పారు నేను పిచ్చివాడిని, లోకంలో ప్రతీ వాడు పిచ్చివాడే అన్నారు. ఒకొక్కరికి ఒకొక్క పిచ్చి. ఒకరికి సినిమాలు పిచ్చి, ఒకరికి డ్రామాలు పిచ్చి, ఇంకొకడికి రాజకీయం పిచ్చి, ఇలా ప్రతి వాడికి ఒక పిచ్చి ఉంది. నాకు పిచ్చి ఉంది, నాకు దేవుడు అంటే పిచ్చి అన్నారు.

గణపతి శాస్త్రి గారు భగవాన్ దగ్గరకి విరూపాక్ష గుహలో ఉండగా వెళ్ళారు, అక్కడ భగవాన్ కూర్చున్నారు. అప్పుడు భగవాన్ పాదాలు పట్టుకుని స్వామి ఎన్నో గ్రంధాలు చదివాను, ఎన్నో జపాలు చేశాను కాని తపస్సు అంటే ఏమిటో నాకు ఇంతవరకు అర్థం కాలేదు. మిమ్మల్ని ఆశ్రయించాలని వచ్చాను అన్నారు. ఎవరు? గణపతి శాస్త్రి గారు, అప్పుడు భగవాన్ ఒక రెండు నిముషాలు మౌనంగా ఉండి, మీరు నేను నేను అని అంటున్నారే అది కూడా ఒక తలంపే, ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో చూడు, అది అక్కడ లయమవుతుంది. అదే తపస్సు. ఆడవాళ్ళు ఎవరు నిద్రలో మేము ఆడవాళ్ళం అని అనుకోరు. నేను పురుషుడిని, నేను పురుషుడిని అని నిద్రలో ఏ పురుషుడు అయినా అనుకుంటాడా? ఏమి అనుకోడు. ఎందుచేత అంటే నేను నేను అనేది లేదు అక్కడ. ఆ నేను అనేది వచ్చిన తరువాత నేను దేహాన్ని అనే భావన వచ్చిన తరువాత నేను స్త్రీని, నేను పురుషున్ని, నేను తహశీల్దారును, నేను ఆఫీసరును, లేకపోతే నేను సర్వెంటును, నేను మంత్రిని అని నేను అనే తలంపు వచ్చాక మీకు మిగతా తలంపులు వస్తున్నాయి కాని ఆ నేను తలంపు రాక ముందు మీకు ఆ తలంపు లేనే లేదు. నేను అనే తలంపు వచ్చాకే మీకు దేహబుద్ధి వస్తుంది కాని అంతకుముందు దేహబుద్ధి కూడా లేదు. మీరు గాఢనిద్రలో ఉండగా ఈ దేహం నాది, ఈ దేహం నాది అని మీరు అనుకుంటున్నారా? ఈ నేను అనే తలంపు వచ్చిన తరువాత అనుకుంటున్నారు ఈ దేహం నాది అని.

ఈ శరీరానికి పరిమితం అయిన నేను, ఈ మనసుకి పరిమితం అయిన నేను ఇది అహంకారం, అహంకారం అంటే కోపం అని కాదు. ఈ దేహానికి పరిమితం అయిన నేనే అహంకారం. ఈ దేహం ఉండగా అహంకారం మరణిస్తే మీరు జ్ఞానులు అవుతారు, ఈ దేహం ఉండాలి, దేహం ఉండగా అహంకారం మరణించాలి. అప్పుడు భగవంతుడు స్వరూపం

పొందుతారు. అహంకారం పోకుండా మీకు ఈ దేహం కనుక మరణిస్తే ఇంకొక దేహం వస్తుంది, అది మరణం కాదు. అది స్వప్నంలో చచ్చిపోవటం లాంటిది.

నేను మూర్తి రాజు గారి ఇంటిదగ్గర పడుకున్నాను. రాత్రి ఏమని కల వచ్చింది అంటే రాజోలు వెళ్ళినట్టు కల వచ్చింది. ఈ దేహం మూర్తి రాజు గారి ఇంటి దగ్గర ఉంది, రాజోలు స్వప్నంలో వచ్చిన దేహం వెళ్ళింది, రాజోలు చూసింది, వచ్చేసింది. మళ్ళీ మెలకువ వచ్చింది మెలకువ వచ్చాక ఆ దేహానికి అన్నం పెట్టాలి, ఆ దేహానికి స్నానం చేయించాలి, తీరా ఆ దేహం రాజోలులో ఉండిపోయిందేమో అని ఆ దేహం కోసం ఎదురుచూస్తూ ఆ దేహం కోసం వెతుక్కుంటూ నేను పరుగు పెడతానా? పరుగెట్టను, ఆ ప్రయత్నం చెయ్యను. ఎందుచేత? ఆ దేహం అబద్ధం అని నాకు తెలుసు. అది ఎంత అబద్ధమో జ్ఞానం కలిగిన తరువాత ఈ దేహం కూడా అంతే అబద్ధం. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఈ దేహం పుట్టినప్పుడు నువ్వు పుట్టటం లేదు. ఈ దేహం మరణించినప్పుడు నువ్వు మరణించటం లేదు. మరి ఎప్పుడు పుట్టావు? ఈ నేను నేను అనే తలంపు, ఈ నేను అనే అహంకారం ఎప్పుడైతే పుట్టిందో అప్పుడు నువ్వు పుట్టావు. ఈ నేను అనే అహంకారం ఎప్పుడైతే నశిస్తుందో అప్పుడు నువ్వు మరణిస్తావు. అది నీ చరిత్ర. మన అందరికి దేహం అంటే ఇష్టం, ఎవరి దేహం వారికి చాలా ఇష్టం. కాని దేహం మటుకు మనలను విడిచి పెట్టి వెళ్ళిపోతుంది. నాకు ఇష్టం అయితే మటుకు ఉంటుందా నా కూడా? అది నేను కాదు కాబట్టి విడిచి పెడుతుంది. ఇవాళ ఒక తలంపు ఇష్టం, రేపు ఇంకొక తలంపు ఇష్టం, ఆ తలంపుని నేను కాదు కాబట్టి ఆ తలంపులు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, మారుతూ ఉంటాయి. ఇవాళ ఉన్న మనసు రేపు లేదు, రేపు ఉన్న మనసు ఎల్లుండ లేదు. ఏమండీ మనం రోజు వరి అన్నం తింటున్నాం, ఇడ్లీలు తింటున్నాం. తిండిని బట్టి ఈ దేహం పెరిగింది, మరి ఈ అహంకారానికి మేత ఏమిటి? దీనికి మేత ఉండాలి, అహంకారానికి మేత ఏమిటి? ఒకటి రూపం, రెండు నామం. తిండి తింటే దేహం ఎలా అయితే పెరుగుతుందో, ఈ రూపం తినటం వల్ల, ఈ నామం తినటం వల్ల అహంకారం పెరుగుతుంది. నా దేహానికి ఒక రూపం ఉంటుంది, ఒక రూపం ఉన్నప్పుడు పేరు ఉంటుంది. ఆ పేరు గురించి, ఆ రూపం గురించి నేను ఆలోచిస్తూ ఉంటాను. నాకు అహంకారం పెరుగుతూ ఉంటుంది. అందుచేత పెద్దలు ఏమి చెప్పారు అంటే నీ రూపం లోంచి, నీ నామం లోంచి, బయటకు తీసుకు రావటం కోసం కృష్ణుడు అని, రాముడు అని, శివుడు అని దేవతామూర్తులను ఏర్పాటు చేశారు. ఆ రూపాన్ని నువ్వు ప్రేమించగా, ఆ నామాన్ని నువ్వు ప్రేమించగా, నీ రూపం లోంచి, నీ నామం లోంచి బయట పడటం కోసం, ఆ రూప ధ్యానం పెట్టారు, ఆ నామ జపం పెట్టారు. మన పెద్దలు చేసిన ఏర్పాటు అది.

ఒకరు భగవాన్‌ని అడిగారు ఏమండీ భగవంతుడు అంతటా ఉన్నాడు కదా మరి ఈ

కొండ దేవుడు అంటున్నారు ఏమిటి మీరు, ఇది బాగోలేదు అంటే భగవాన్ ఏమన్నారు అంటే ఈ దేహానివి నువ్వా? ఈ మాంసం నువ్వు అనుకుంటే, ఈ రక్తం నువ్వు అనుకుంటే, ఈ ఎముకలు నువ్వు అనుకుంటే, ఆ కొండ దేవుడే. ఈ దేహానివి నువ్వు కాదు, కాని నువ్వు అనుకుంటున్నావు. ఈ దేహం నాది అని నువ్వు ఎలా అనుకుంటున్నావో, అరుణాచలేశ్వరుడు ఈ కొండను ఇది నేను అని అనుకుంటున్నాడు. నువ్వు ఈ దేహం తోటి కలిసి ఉన్నావు, శివుడు ఆ కొండ తోటి కలిసి ఉన్నాడు. ఈ దేహం నాది, ఈ దేహం నాది అని నువ్వు అనుకుంటున్నావు. ఆ కొండ నేను, ఆ కొండ నేను అని దేవుడు అనుకుంటున్నాడు. ఎందుకు అనుకుంటున్నాడు? నీ దేహబుద్ధి పోగొట్టటం కోసం ఆ కొండ రూపంలో వెలిశాడు పరమేశ్వరుడు. భగవాన్ చెబుతున్నారు గణపతి శాస్త్రి గారికి, ఈ నేను అనే తలంపు ఎక్కడ నుంచి వస్తుందో చూడు, ఈ నేను అనేబుద్ధి, ఈ నేను అనే మనస్సు, ఈ నేను అనే వృత్తి, ఇది ఎక్కడ నుంచి వస్తుందో చూడు. అది నీ లోపల నుంచే వస్తోంది. అది ఎక్కడ నుంచి వస్తోందో అన్వేషించు, అది వెతుకు, ఈ నేను అనే తలంపును వెతకగా, వెతకగా, ఈ నేను వెళ్ళి దాని మూలంలో లీనం అవుతుంది, ఎక్కడ? దాని మూలంలో. ఈ నేను ఎక్కడ పుడుతుందో మనకి తెలియక పోతే మనకు జ్ఞానం కలగదు. దేహం పుడుతుంది, మరణిస్తుంది. అది కాదు ఈ నేను పుట్టిన చోటు ఎక్కడో మనం చూడాలి. ఆ పుట్టిన చోటు కనుక మనకి తెలిస్తే ఈ నేను అనే తలంపు అక్కడ లయం అవుతుంది. అదే తపస్సు. ఋషి, ఋషి అంటే ఏమి లేదు నిజం తెలిసినవాడే ఋషి, ఏది నిజం? మనం అనుకునే వ్యవహారిక నిజం కాదు. మూడు కాలాల్లోను ఏదైతే స్వయంగా ప్రకాశిస్తుందో, దేనికైతే మృత్యువు లేదో, అదే నిజం. ఆత్మ నిజం. దానిని తెలుసుకున్న వాడే ఋషి అవుతాడు.

ఎవరి మాటలు వింటే, ఎవరిని దర్శనం చేస్తే, మనకు జ్ఞానం సంపాదించాలి అనే ఆకాంక్షమీ హృదయంలో వస్తుందో వాడే మహాత్ముడు. మహాత్ముడికి ఏమి కొమ్ములు ఉండవు. మహాత్ముడు అంటే ఏమిటి? గొప్ప ఆత్మ కలవాడు. Greatest soulని మనం మహాత్ముడు అంటాం, ఎవడు మహాత్ముడు? ఎవడి సన్నిధానంలో కూర్చుంటే మీకు శాంతి కలుగుతుందో, ఎవరి సన్నిధానంలో కూర్చుంటే జ్ఞానం పొందాలి అనే తపన, ఆ వేదన, ఆకాంక్ష మీ హృదయంలో నుంచి ఉబికి వస్తుందో వాడే మహాత్ముడు. కొంతమంది అంటారు ఏవండీ మీ రమణమహర్షి గారు చెప్పకపోతే పూర్వం ఏమి లేదా? భగవద్గీతలో లేదా? రామాయణంలో లేదా? ఉపనిషత్తులులో లేదా? బైబిలులో లేదా? ఖురానులో లేదా? ఇప్పడు ఈ రమణమహర్షి చెప్పేది ఏమిటండి? అంటే చెబితే చాలదు, అందులోనూ ఉన్నాయి, అవి జీవించాలి, జీవించకపోతే వాటికి గౌరవం లేదు.

భగవద్గీత ఐదు వేల సంవత్సరాల నాడు ఎప్పుడో భగవంతుడు వాసుదేవస్వామి

అర్జునుడికి చెప్పాడు. ఈలోపు రమణమహర్షి లాంటి వాళ్ళు వచ్చి ఆ పుస్తకంలో చెప్పిన మాటలతో జీవించకపోతే, ఆ పుస్తకానికి గౌరవం లేదు, ఆ పుస్తకాన్ని ఎవరు ఆదరణ చేయరు, ఆచరించరు. ఒక రమణమహర్షి ఈ భూమి మీదకి రావడం వల్ల భగవద్గీతకి గౌరవం పెరిగింది. ఒక రమణమహర్షి ఈ భూమి మీదకి రావడం వల్ల ఉపనిషత్తులకి గౌరవం పెరిగింది. ఎప్పుడో కృష్ణుడు చెప్పిన మాటలని నిజమని చెప్పి ఋజువు చేసినవాడే రమణమహర్షి. వాళ్ళు అందరూ చెప్పలేదా? ఈయన వచ్చి కొత్తగా చెప్పేది ఏమిటంటే, వాళ్ళు చెప్పిన దాంట్లో జీవించాడు ఈయన, అందుచేత వాళ్ళు చెప్పిన దానికి గౌరవం పెరిగింది. పుస్తకంలో ఉన్న దానిని మన మస్తకంలోకి లాక్కోవాలి. తడి గుడ్డను పిండండి నీళ్ళు కారతాయి, అదే నాలుగు వేదాలను, ఉపనిషత్తులను మీరు పిండండి ఆ నీళ్ళు కారతాయి. ఏ నీళ్ళు? ఆత్మ వస్తువు, ఆ పరమ వస్తువు, ఆ పరతత్వం, you are that అది నువ్వే. మీకు తత్త్వం తెలిసిందా అంటారు మన వాడుక భాషలో చూడండి. తత్త్వం అంటే మీకు ఆత్మ తెలిసిందా?

భగవాన్ చెప్పారు మనకు ఉన్న వస్తువు ఏదోఉన్నట్టుగా తెలుసుకునే వరకు, ఉన్న వస్తువు మనకు అర్థం అయ్యే వరకు, లేనిది ఉన్నట్టుగా కనిపిస్తుంది, అబద్ధం నిజంగా కనిపిస్తుంది, మనకి నిజం తెలిసే వరకు అబద్ధం నిజంగా కనిపిస్తుంది. జ్ఞానం సంపాదించిన తరువాత శరీరాన్ని విడిచి పెట్టేసినా ఇబ్బంది లేదు. ఎప్పుడు? జ్ఞానం పొందిన తరువాత. జ్ఞానం కలగకుండా శరీరం విడిచి పెడతాము అనుకోండి మళ్ళీ ఇంకొక శరీరం వస్తుంది. మీరు ఇంటికి వెళ్ళి ఆలోచించండి. ఒక రూపం గురించి ఆలోచిస్తుంది మీ మనసు, మళ్ళీ ఆ రూపాన్ని విడిచి పెట్టేస్తుంది కొత్త రూపాన్ని పట్టుకుంటుంది. కొంతమందికి వయసులో భార్య అంటే ఇష్టం, మళ్ళీ మనవలు పుట్టాక భార్య మీద ఇష్టం తగ్గుతుంది, మనవల మీద ఇష్టం పెరుగుతుంది. పెళ్ళమో లేకపోతే తల్లో లేకపోతే తండ్రో లేకపోతే మనవలో లేకపోతే కొడుకులో ఏదో ఒక రూపాన్ని పట్టుకుని ఎప్పుడూ ఏడుస్తూ ఉంటుంది. దానికి రూపం మేత. కొంతమంది శివుడిని మానేసి రాముడిని పట్టుకుంటూ ఉంటారు, రాముడిని వదిలేసి కృష్ణుడిని పట్టుకుంటారు. ఈ దేవుడు దగ్గర బాగోలేదు అనుకోండి ఏసుక్రీస్తుని పట్టుకుంటారు. దానికొక రూపం కావాలి. అహంకారానికి ఏమిటి? ఏదో ఒక రూపం కావాలి. రూపం నిజం కాదు. భగవంతుడికి రూపం లేదు, భగవంతుడికి నామం లేదు. నాకు రూపం ఉంది కాబట్టి ఆ రూపం లేకపోతే ఆయన చెప్పే మాట నాకు అర్థం కాదు కాబట్టి, ఏదో తాత్కాలికంగా రూపం

**ఒక చెడ్డ ఒక మంచికోసం వస్తుంది. మనం ఇలా చెడ్డ జరిగిందేమిటి అనుకుంటాము, చివరికి అది మంచి జరుగుతుంది. ఏది మంచో ఏది చెడ్డో మనకి తెలియదు.**



ధరించి వస్తాడు కాని ఆ రూపం ఆయన కాదు, ఆ రూపం నిజం కాదు.

కృష్ణుడు చెప్పాడు స్వయంగా నేను పుట్టిన వాడివలె కనిపించాను. కనిపిస్తున్నది అంతా నిజం కాదు అని చెప్పాడు. ఆత్మ పుడుతుందా? ఊరికే పైకి మన కళ్లకి అలా కనిపిస్తుంది. మనకి దేహభావన ఉంది కాబట్టి భగవంతుడు కూడా ఒక దేహం తొడుక్కుని వస్తాడు. దేహాన్ని తొడుక్కుని వస్తేనే కానీ మనకి తెలియదు కాబట్టి! భగవంతుడు మనకి నిజం చెబుతాడా? అబద్ధం చెబుతాడా? భగవంతుడు నిజమే చెబుతాడు అయితే భగవంతుడి మాట మీద నాకు ఎందుకు విశ్వాసం లేదు? దానికి నాకున్న లోకచింతన కారణం. మీ ఇంట్లో ఎవరికైనా 104 జ్వరం ఉంది అనుకోండి అన్నం పెట్టండి ఊసేస్తాడు. కంచం ఎదురుగానే ఉంది, వాడు ఎదురుగానే ఉన్నాడు ముద్ద తీసుకుంటే లోపలకి దిగుతుందా అంటే, దిగదు. ఎందుకు అంటే వాడికి జ్వరంగా ఉంది. అదే విధంగా మనకి లోకజ్వరం 105 డిగ్రీలు, 107 డిగ్రీలు కొడుతోంది. నిరంతరం లోకచింతనే. దైవచింతన లేదు. నిరంతరం లోకచింతన కాబట్టి మనకి భగవంతుడు చెప్పిన మాటలు ఎంత నిజం చెప్పినప్పటికీ ఆయన ఘోషించి, ఘోషించి, తిరిగి, తిరిగి, మళ్ళీ, మళ్ళీ ఆయన ఉద్గారించి నప్పటికి ఆ ఉద్గారణ మనకి అబద్ధంగా కనిపిస్తుంది. కారణం ఏమిటి? భగవంతుడు చెప్పిన మాటలు నిజం అయినప్పటికీ మనకి అబద్ధం కింద కనిపించటానికి మనకున్న మోహం కారణం. మనకున్న మోహం వల్ల భగవంతుడు చెప్పిన నిజం అబద్ధంగా కనిపిస్తుంది, భగవంతుడు ఏదైతే అబద్ధం అని చెప్పాడో అది నిజం కింద కనిపిస్తుంది.

సోదరమహాశయులారా! మన అందరి దగ్గర ఇంకొక ప్రమాదం ఉంది మీరు ఎప్పుడైనా భగవద్గీత చదవండి. ఆ భగవద్గీతలో భగవంతుడు ఏమి చెప్పాడో అది మన బుర్రకు పట్టించుకుందాం అని మనకి ఉండదు. మన బుర్రలో ఉన్నది అందులో చూస్తూ ఉంటాం. నేను చెప్పిన మాటలు నమ్మకండి, మీరు ఇంటి దగ్గర పరీక్షించుకోండి. మనస్సు అనేది మన సమస్య. గ్రామంలో పంచాయితీ సమస్యలను పరిష్కారం చేస్తున్నాం, ఇంటిలోని సమస్యలను పరిష్కారం చేసుకుంటున్నాం, దేశంలోని సమస్యలను పరిష్కారం చేసుకుంటున్నాం, కాని మనసు అనే సమస్యను మనం పరిష్కారం చేసుకోలేక పోతున్నాం. ఏమండీ మనసు అనే సమస్యను మీరు ఎవరైనా పరిష్కారం చేసుకున్నారా? మీరు పండితుడి దగ్గరకు వెళ్లి ఏమండీ మీరెవరో మీకు తెలుసా అని అడగండి. లేకపోతే రాజకీయ నాయకుడు దగ్గరకు వెళ్లి నువ్వు ఎవరవో నీకు తెలుసా అని అడగండి మీరు, ఒక పెద్ద సైంటిస్టు దగ్గరకు వెళ్లి నువ్వు ఎవరవో నీకు తెలుసా అని అడగండి, వాడు తలవంచుకోవాల్సిందే వాడు ఎవడో వాడికి తెలియదు. ఈ రహస్యం మీరు ఎవరికీ చెప్పకండి. భగవంతుడిని తెలుసుకుంటేనే కాని ఈ మనస్సు లొంగదు. మనస్సు లొంగితేనే కాని భగవంతుడు తెలియబడడు. చెప్పండి ఇప్పుడు ఎవరు

పరిష్కారం చేస్తారు? పంచాయితీలో పెడదామా? లేకపోతే కోర్టుకి వెళదామా? ఎలా పరిష్కారం చేద్దాం? మీ మనస్సు భగవంతుడిని కోరుకోవటం లేదు, కోరుకోకపోతే పోనీ భగవంతుడిని మింగుదాం అని చూస్తుంది. భక్తుడికి కావాల్సినది ధనం ఉండాలి, వైకుంఠంలోనో, కైలాసంలోనో ఎక్కడో దేవుడు ఉండాలి, వీడు అడుగుతూ ఉంటాడు, ఆ దేవుడు ఇస్తూ ఉండాలి, ఆ కోరిక నెరవేర్చుకుంటూ ఉండాలి కామన్‌గా మన సమాజంలో ఉన్న భక్తి ఇదే! వాడు ఇస్తాడు మీరు పుచ్చుకుంటూ ఉంటారు. మీరు అనుభవిస్తూ ఉంటారు ఇలా ఎంతకాలం? దీనివల్ల ఏమైనా సమస్య పరిష్కారం అవుతుందా? మీకు ఏమైనా దుఃఖం తగ్గుతుందా? మీకు ఏమైనా అజ్ఞానం బయటకి పోతుందా? ఆయన ఇస్తాడు, మీరు పుచ్చుకుంటారు. వాటిని ఎంజాయ్ చేస్తారు, తరువాత అవే వాసనలు అవుతాయి. అవే మీ ముక్కు పట్టుకుంటాయి. ఈ చక్రంలోంచి బయటకు రాలేరు. మనం దేవుడు దగ్గరకి అరటి పళ్ళు పట్టుకెళుతున్నాం, ఆయన నిజంగా తినడం మొదలు పెడితే ఎవడు పట్టుకెళ్ళడు.

భగవాన్ అనేవారు నాకంటే గుళ్ళో ఉన్న దేవుడు చాలా అదృష్టవంతుడు, గుళ్ళో ఉన్న దేవుడిని ఎవరు తినమని అడగరు. కాని నా దగ్గరకు వచ్చి తినమంటున్నారు ఇదో పెద్ద బాధగా ఉంది నాకు, అందుకు నాకంటే గుళ్ళో ఉన్న దేవుడు అదృష్టవంతుడు. సత్యం తెలిస్తేనే కాని, ఆత్మ తెలిస్తేనే కాని, భగవంతుడు తెలిస్తేనే కాని మన మనస్సు లయం కాదు. మనో నాశనం కాదు. మనో నాశనం అయితేనే కాని దేవుడు తెలియబడడు. ఏది ముందు, ఏది వెనకాల అంటే simultaneousగా చెయ్యాలి. అంటే మనం భగవంతుడిని తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలి. మన ప్రయత్నమే సాధన. ప్రయత్నం చేస్తూ ఉంటే అనుగ్రహం మీ మీద పడుతుంది. మీరు దేవుడిని స్మరించే కొలది, దేవుడిని ధ్యానం చేసే కొలది, మీకు అనుగ్రహం వస్తుంది. ప్రయత్నం వేరు, అనుగ్రహం వేరు కాదు. మీరు మాములుగా నడిచివెళుతుంటే మీకు ఆ గమ్యం వచ్చేస్తుంది. అదే విధంగా మీరు గమ్యం ఆత్మను పెట్టుకుని, గమ్యం పరమాత్మని పెట్టుకుని, మీరు సాధన చేస్తుంటే మీరు గమ్యానికి వెళ్ళిపోతారు. కాని మీరు గమ్యం ఆత్మని పెట్టుకోవటం లేదు, పరమాత్మను పెట్టుకోవటం లేదు, సత్యాన్ని పెట్టుకోవటం లేదు, ఏమి పెట్టుకుంటున్నారు అంటే పరమాత్మ కల్పించిన సృష్టిని పెట్టుకుంటున్నారు. మీరు గమ్యం చేరుకుంటారా? చేరుకోరా? అనేది వేరే విషయం. కాని మీరు గమ్యం పరమాత్మను పెట్టుకోవాలి. మీరు సాధించవలసింది పుణ్యం కాదు, వైకుంఠం కాదు, కైలాసం కాదు, భగవంతుడు ఏమని చెప్పాడు నేను మీ హృదయంలో ఆత్మగా ప్రకాశిస్తున్నాను. మీ చేతులు కంటే మీ గుండె కంటే మీకు అత్యంత సమీపంగా మీ హృదయంలోనే ఉన్నాను. అది నేనుగా ఉన్నాను. ఏవండీ, హృదయంలో ప్రకాశిస్తున్న దేవుడు మనకు అర్థం కాదు కాబట్టి మనం రూప భావన విడిచిపెట్టటం లేదు కాబట్టి రాముడు నేను, కృష్ణుడు నేను, శివుడు నేను,

కుమారస్వామి నేను, విఘ్నేశ్వరుడు నేను అని చెప్పాడు. మీ హృదయంలోనే ఆత్మగా ప్రకాశిస్తున్నాను నేను అని భగవంతుడు చెప్పింది final statement. ఇది true statement. అయితే రూప భావన విడిచిపెట్టటం అంటే సామాన్యం కాదు మరణించేటప్పుడు కూడా మనవరాలని చూడాలని ఉంది, తీసుకు రమ్మంటుంది. మనవరాలంటే మనవరాలే కాదు, ఎవరికి ఏది ఇష్టం ఉంటే అది. అందుచేత మీ గమ్యాన్ని మటుకు భగవంతుడినే పెట్టుకోవాలి. సత్యాన్నే పెట్టుకోవాలి. ఆత్మనే పెట్టుకోవాలి.

**కృతి మహోదధౌ పతన కారణం**
**ఫలమశాశ్వతం గతి నిరోధకం ॥**

మీకు మామిడిపండు తినాలని అభిరుచి ఉంది అనుకోండి, మళ్లీ రేపు మామిడి పండు ఎక్కడైనా కనిపించింది అనుకోండి మీకు ఏమి అనిపిస్తుంది. ఆ మామిడిపండు తినాలి అనిపిస్తుంది. ఎందుచేత అనిపిస్తుంది? అది చాలా బాగుంది. చాలా రుచిగా ఉంది, ఆ కోరిక, ఆ సంస్కారం మీ హృదయంలో ఉండిపోయింది. అందుచేత మళ్లీ ఆవస్తువును సంపాదించి, ఆ వస్తువును తినాలనిపిస్తుంది గాని, గతి అనేటువంటి మోక్షం వైపు మనసు మళ్లదు. మనం ఏ వస్తువును అయితే అనుభవిస్తున్నామో అనుభవించేటపుడు సరదాగా ఉంటుంది, అది సంస్కారాల రూపంలో, కోరిక రూపంలో మనలని బంధిస్తుంది. మీకు ఏదైనా పని జరగవలసి ఉంది అనుకోండి, మీ కోరిక అక్కర్లేదు. నాకు కోరిక లేకపోతే పని అవ్వదేమో అని మీరు అనుకుంటారు. కాని కోరిక లేకపోయినా జరుగుతుంది. మీ ప్రారబ్దంలో పని అవ్వవలసి ఉంటే అది తప్పనిసరిగా మీ కోరిక తోటి నిమిత్తం లేకుండా ఆ పని అయ్యి తీరుతుంది.

ఒకసారి భగవాన్ దగ్గర దేవరాజ్ మొదలియార్ గారు కూర్చొన్నారు, అక్కడ టేబుల్ ఫ్యాను ఉంది దాని స్విచ్ ఆన్ చేశారు. ఏవండీ ఇప్పడు నేను టేబుల్ ఫ్యాన్ స్విచ్ ఆన్ చేశాను, ఇది కూడా తల్లి గర్భం నుంచి దేహం బయటకు వచ్చినప్పుడే నిర్ణయించబడిందా అని అడిగితే, Certainly అన్నారు భగవాన్, నా దగ్గర కూర్చోవటం, టేబుల్ ఫ్యాన్ స్విచ్ ఆన్ చేయడం తల్లి గర్భం నుండి బయటకు వచ్చినప్పుడే నిర్ణయించబడింది. Certainly ఇది నిజం. మీ effort ఉన్నా, లేకపోయినా అది జరిగి తీరుతుంది. అందుచేత మీరు అందరూ కంగారు పడకండి. మీకు జరగవలసిన పని ఉంటే మీ కోరిక తోటి నిమిత్తం లేకుండా మీకు పని అవుతుంది. అందుచేత కోరికలు కోరక్కరలేదు. భగవాన్ చెప్పారు మీ భర్త, మీ పిల్లలు, మీ మనవరాలు, మీ బ్యాంకు అకౌంటులు సంసారం కాదు. మీ కోరిక సంసారం. ఎక్కడైతే కోరిక ఉందో అక్కడ సంసారం ఉంది. ఏవండీ మీరు ఇపుడు మరణించారు అనుకోండి, ఊరు కనపడదు, దేశం కనపడదు, లోకం కనపడదు, మీ దేహభావన కనపడదు. మీరు

సుబ్బాయమ్మే. సుబ్బాయమ్మ సుబ్బాయమ్మలాగే ఉంటారు. మీరు ఏమీ మారరు, మీరు నేను నేను అంటున్నారు చూడండి. ఆ నేనులో ఏమి మార్పు రాదు. నేనేమి మారను. నా దేహం మారచ్చు, నా ఇల్లు మారచ్చు, నా లక్షణాలు మారచ్చు, నా పరిసరాలు మారచ్చు, ఏది మారినప్పటికీ నేను మారను. నేను నేను లాగే ఉంటాను.

ఇప్పుడు మీరు ఎక్కడ నుంచి వచ్చారు? శృంగవృక్షం నుంచి వచ్చారు. ఎంతో ప్రయాణం చేసి వచ్చారు. కారు మారారు, పడవ మారారు, రిక్షా మారారు. శృంగవృక్షంలో ఉన్న నేను వేరు, సఖినేటిపల్లిలోని నేను వేరా? ఆ నేనే ఈ నేను. మీరు ఏమైనా మారారా? మీరు ఏమి మారలేదు. అదే విధంగా మరణం వల్ల కూడా మనం ఏమి మారము. మరణం వలన దేహం మారిపోతుంది, పరిసరాలు మారిపోవచ్చు. దేశం మారిపోవచ్చు, కాని ఏది మారినప్పటికీ ఈ నేను మారదు. ఆ నేను ఉన్నంత కాలం సంసారం వస్తుంది. మీకు దుఃఖం వస్తుంది. ఆ దుఃఖం మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఒక్క మాట చెప్పమంటారా? మీ అందరికి సుఖం కావాలి. ప్రతీ జంతువుకి సుఖం కావాలి. మీకు సుఖం కావాలి, నాకు సుఖం కావాలి. బీదవాడికి సుఖం కావాలి, ధనవంతుడికి సుఖం కావాలి, ప్రతీజీవుడికి సుఖం కావాలి. లోకంలో ప్రతీ వాడు సుఖం కోసం వెతుక్కుంటున్నాడు. ప్రతీ వాడు సుఖాన్ని పొందాలి, వాడు డబ్బు సంపాదిస్తాడు ఎందుకు? సుఖం కోసం. ప్రతీవాడికి సుఖం కావాలి. నాకు సుఖం అక్కర్లేదు అని చెప్పే మానవుడు ఎవరైనా ఉన్నాడా? మీ సుఖం కోసమే మీరు వెతుక్కుంటున్నారు. దీనికి అందమైన పేరు పెట్టారు, నాకు దేవుడు కావాలి. ఏవండీ, మీకు సుఖం కావాలి కాబట్టి ఆ దేవుడు కనిపిస్తే మీకు సుఖం ఇస్తాడు కాబట్టి అందుచేత మీరు దేవుడిని కోరుకుంటున్నారు కాని దేవుడి తోటి మీకు పని ఏముంది అసలు? మీకు కావాల్సింది సుఖం.

భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే ఆ సుఖం మీ హృదయంలోనే ఉంది. నువ్వు వెతికే సుఖం, నువ్వు అన్వేషించే సుఖం, అది ఎక్కడ ఉంది? నీ హృదయంలో పరమాత్మ రూపంలో సుఖం అక్కడే ఉంది. నీ మనసుని ఒక్కసారి లోపలికి పంపు, ఊరికే ఒక్క అడుగు వెయ్యి, పరమాత్మ నీకోసం పది అడుగులు వేస్తాడు. మన భారతీయ సంప్రదాయంలో ఏముంది అంటే కాశీలో మరణిస్తే ముక్తి అని, అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి అని, తిరువాయూరులో జన్మిస్తే ముక్తి అని, చిదంబరాన్ని దర్శిస్తే ముక్తి అని, ఇది మన భారతీయ సాంప్రదాయంలో ఉంది. అటువంటి పుణ్య క్షేత్రాలలో అరుణాచలం ఒకటి, దీనినే తిరువణ్ణామలై అంటారు. ఈ తిరువణ్ణామలై ఎప్పుడైనా చూసి రండి, అది చాలా గొప్ప క్షేత్రం. చాలా పుణ్య క్షేత్రం. సర్వ సాధారణంగా భగవాన్ దగ్గరకి వెళ్లేవారు అందరూ కష్టాలు చెప్పకుంటారు. భగవాన్ అనేవారు మీరు అందరూ వచ్చి నాతో చెప్పుకుంటున్నారు, మరి నేను ఎవరితో చెప్పకోను?

మీకు అందరికి ఉండే కష్టాలు నాకు ఉన్నాయి, మీకు అందరికి ఉండే బాధలు నాకు ఉన్నాయి. మీరు అందరూ చెప్పకోటానికి ఒకస్వామి ఉన్నాడు. ఈస్వామి ఎవరితో చెప్పకుంటాడు?

ఒకసారి భగవాన్ దగ్గరకి ఎవరో ఒక అబ్బాయి వచ్చాడు. ఆ అబ్బాయితో భగవాన్ నీకు ఏమి కావాలి అన్నారు, ఆ అబ్బాయి స్వామి నాకు ఏమి అక్కర్లేదు అన్నాడు. భగవాన్ పెద్ద ముఖం చేసుకుని అబ్బా ఎంత కాలానికి కనిపించావు, ఏనాటికి దొరికావు అయ్యా, నా జాతి వాడవు అన్నారు. ఏ పని చేసినా భగవంతుడు సంతోషించటం కోసం పని చెయ్యాలి కాని గొప్పల కోసం చెయ్యకూడదు. గొప్పల కోసం చేస్తే తిప్పలు తప్పవు. భగవంతుడు ప్రీతి కోసం పనిచేస్తే మోక్షం వస్తుంది, అంటే ఏ పని చేసినా భగవంతుడు సంతోషం కోసమే మనం చెయ్యాలి. ఎందుచేత? మోక్షం ఇచ్చేవాడు ఆయనే కాబట్టి, మనం ఒంటరిగా ఈ భూమి మీద వచ్చాము, మళ్ళీ ఒంటరిగా ఈ భూమిని విడిచి పెట్టి వెళ్ళిపోవాలి. మనకు సహాయం చేసేది ఎవరు? మన బంధువులు చేస్తారా? మనకు మరణం వచ్చిన తరువాత మన ప్రాణం ప్రయాణం చేసేటపుడు ఎవరు మనకు సహాయం చేసేది? ఒక్క ఈశ్వరుడే. ఈశ్వరుడు ప్రీతి కోసం, ఈశ్వరుడు సంతోషం కోసం మనం ఏ పని అయినా చెయ్యాలి. నీకు ఏది కావాలో భగవంతుడికి తెలుసు, ఏది ఎప్పడు అవసరమో, ఎక్కడ అవసరమో, ఎప్పడు ఇవ్వాలో భగవంతుడికి తెలుసు. ఆయన ఇస్తాడు, మీరు ఏమి కంగారు పడకండి. మన ప్రయత్నం మనం చేసుకోవాలి, కాలం కలిసి రావాలి, ఈశ్వరుడు అనుగ్రహం ఉండాలి. ఈ మూడు ఉంటే పని నెరవేరుతుంది. అందుచేత మనం ఏ పని చేసినా ఈశ్వరుడు ప్రీతి కోసమే పని చెయ్యాలి, అహంకారాన్ని జయించకుండా ఎవరు లోకాన్ని జయించలేరు. మానవుడు అహంకారం కోసమే బ్రతుకుతున్నాడు. వాడు చేసే పనులు అన్నీ కూడా అహంకారం కోసమే చేస్తున్నాడు.

మనం చేసే సాధన ఏమిటి? ఎక్కడకు వెళదాం అని సాధన చేస్తున్నారు. ఏమి attain చేద్దామని సాధన చేస్తున్నారు? మోక్షం అంటే మీరు సంపాదించేది కాదు అది మీరే. మీ స్వరూపమే మోక్షం. అది తెలియక నన్ను శరీరం బాధలు పెడుతోంది, నన్ను సంసారం బాధ పెడుతోంది. నేను మరణిస్తున్నాను. జన్మిస్తున్నాను అనుకుంటున్నాం. ఎందుకు? మన స్వరూపం మనకి తెలియక. ఉన్నది ఏదో తెలియకపోవడం మూలాన నిన్ను మాయ కమ్మింది. ఉన్నది ఏమిటో ఉన్నట్టుగా తెలుసుకో నీకు అసలు లోకం లేదు, దేవుడు లేడు, దేహం లేదు. ఏదైతే నువ్వో అది నువ్వు కాదు అనుకుంటున్నావు. కాదు అనుకుంటున్నావు కాబట్టి నువ్వు సంసారంలో పడ్డావు. భగవాన్ చెప్పారు ఇల్లు విడిచి పెట్టి నువ్వు ఎక్కడికో పారిపోతే నువ్వు అహంకారాన్ని జయించలేవు. నువ్వు ఇంటికాడ ఉన్నా అహంకారాన్ని జయించాలి, కాశీ వెళ్ళినా అహంకారాన్ని జయించాలి, అరణ్యానికి వెళ్ళినా అహంకారాన్ని జయించాలి. నువ్వు ఇంటికాడ

ఉండి అహంకారాన్ని జయించలేకపోతే అరణ్యానికి వెళ్లి ఎక్కడ జయిస్తావు?

కొంతమంది రేపు రేపు అని రాసుకుంటారు. రేపుకు రూపు లేదు. రేపు చేసుకోవచ్చును, రేపు చేసుకోవచ్చు అంటే ఇదే మాయ. ఏరోజుకారోజే మనం కృషి చేసుకోవాలి, ఏ గంటకు ఆ గంట మనం కృషి చేసుకోవాలి. వర్తమాన కాలం ఒక్కటే నిజం, రేపు ఎలా ఉంటుందో మనకి తెలియదు. మనం అందరం అనుకుంటాం ఎవరైనా బాగా డబ్బు సంపాదించారు అనుకోండి ఏమి achievement వారు నాలుగు కోట్లు సంపాదించారు, ఎవరైనా సినిమాలో బాగా act చేశాడు అనుకోండి, ఏమి అద్భుతంగా act చేసాడండి, ఏమి అపూర్వం, ఏమి ఉదాత్తం, ఇలా అనుకుంటాం. అలాగే ఒక రాయవెల్లూరు పోలీసు సూపరింటెండు భగవాన్ దగ్గరకి వచ్చి,స్వామిస్వామి శ్రీ కృష్ణుడు చాలా గొప్ప పనులు చేశాడు, ఏసుక్రీస్తు కూడా చాలా గొప్ప పనులు చేశాడు. ఏసుక్రీస్తు ఎన్ని గొప్ప పనులు చేశాడో, శ్రీకృష్ణుడు ఎన్ని గొప్ప పనులు చేశాడో, అంత గొప్ప పనులు నాకు కూడా చెయ్యాలని ఉంది, మీరు నన్ను ఆశీర్వదించండి అన్నాడు. ఇది మాయ కాకపోతే ఏమిటండి? నాకు జ్ఞానాన్ని ప్రసాదించమని ఇక్కడ ఎవరు అడగరు. జ్ఞానం వల్లే మోక్షం వస్తుంది. జ్ఞానం లేనివాడికి మోక్షం లేదు. కానీ జ్ఞానాన్ని ఎవడూ అడగడు.

జ్ఞానం గురించి మీరు ఏమి చెప్పరేమిటి అని ఎవరో గౌతమబుద్ధుడిని అడిగితే "ఊరిలో ప్రతీ ఇంటికి వెళ్ళి మీకు ఏమి కావాలి అని అడుగు" అని గౌతమ బుద్ధుడు చెప్పాడు. అప్పడు కొంతమంది "డబ్బు లేక ఇబ్బంది పడుతున్నాం, ఏదో నాలుగు రూపాయలు కలిసి వచ్చేది చూడమన్నారు". కొంతమంది మాకు డబ్బు ఉంది కాని కడుపు నొప్పి వస్తోంది అన్నారట. కొంతమందికి అజీర్తి వల్ల, కొంతమందికి ఆకలి వల్ల, కొంతమంది నా కోడలికి నాకు పడటం లేదు అని కొంతమంది అత్తా కోడళ్ళ దెబ్బలాటలు, కొంతమంది నేను ముసలి వాడిని అయిపోయాను నన్ను ఎవరు చూడటం లేదు, నన్ను ఎవరు ఆదరించటం లేదు, పోనీ కనీసం నాకు ఎవరైనా పెట్టకపోయినా మాట అయినా ఆదరణ లేదు అని కొంతమంది ఇలా అందరూ చెప్పారు. గౌతమ బుద్ధుడు అప్పడు అడిగాడు ఏమయ్యా నువ్వు అందరి ఇంటికి వెళ్లి వచ్చావు. ఏమి అడిగారు? ఫలానా వాడు ఇది అడిగాడు, ఫలానా వాడు ఇది అడిగాడు అని చెప్పాడు. ఒక్క ఇంట్లో, ఒక్క కొంపలో నాకు జ్ఞానం కావాలి అని అడిగిన అమ్మ కాని, అయ్యా కాని ఉన్నారా అని అడిగారు, ఎవరు లేరు అన్నాడట. మరి నన్ను ఎవరికి చెప్పమంటావు? అన్నారట. అలాగే మీ ప్రార్థనలలో, మీ భజనల్లో, మీ పూజల్లో, మీరు ఎప్పడైనా అడిగారా నాకు మోక్షం కావాలి అని, నిజంగా దేవుడు కనిపించడు కాని కనిపిస్తే ఏమి అడుగుతాము? చీపురు కట్ట అడుగుతాము. చీపురు కట్ట అయితే ఇల్లు తుడుచుకోవచ్చు. ఏది అడగాలో మనకే తెలియదు. నిజంగా భగవంతుడు కనిపించటం లేదు అని అనుకుంటున్నాం కాని కనిపిస్తే ఏమి అడగాలో

మనకే తెలియదు.


సోదరమహాశయులారా! గమ్యం ఏమిటో మనం తెలుసుకోవాలి. జ్ఞానాన్ని సంపాదించటం కోసం మన జీవితాన్ని అంతా ఖర్చు పెట్టాలి. మీరు ఊరు విడిచి పెట్టి, ఇల్లు విడిచి పెట్టి ఎక్కడికి పారిపోనక్కర్లేదు. మీ ఊర్లో ఉండి, మీ ఇంటికాడ ఉండి మీరు సాధన చేసి సిద్ధిని పొందవచ్చు. అది మీకు దగ్గరగా ఉన్న వస్తువే, అయితే మీరు చేసే పూజలు ఆడంబరం లేకుండా ఉండాలి. మీరు చేసే జపాలు ఆడంబరం లేకుండా ఉండాలి. మీరు చేసే ప్రయత్నాలు కూడా ఎవరికి తెలియనివ్వకూడదు. గొప్ప కోసం ఎవరి తోటి చెప్పకూడదు. మీరు చేసే ప్రయత్నం మీరు కష్టపడి చేసుకోవాలి, లోపల అభివృద్ధి అవుతున్నా పైకి సామాన్యంగా కనిపించాలి. సోదరమహాశయులారా! మీరు ఎంత శక్తి సంపాదించినా, డబ్బు సంపాదించినా కానీ గమ్యాన్ని విడిచిపెట్టవద్దు, మీరు common man లాగా ఉండండి. కాని మీ గమ్యం మటుకు జ్ఞానం వైపు పెట్టుకోండి. జీవితంలో సరళంగా జీవించండి, సూటిగా జీవించండి, సంతోషంగా జీవించండి.

భగవంతుడి ప్రీతి కోసం మీరు పని చేయటమే యజ్ఞం. యజ్ఞం చేస్తున్నారు, యజ్ఞం చేస్తున్నారు అంటే ఏమిటి? మీ కాలాన్ని, మీ ధనాన్ని కొంత భగవంతుడి కోసం ఖర్చు పెట్టడమే యజ్ఞం. మీకు ధనం లేదు అనుకోండి మీ తెలివితేటల తోటి కొంత మందికి సహకారం చేయండి. మీరు జీవిస్తూ మీతోటి వారు జీవించటానికి మంచి అవకాశాలు కల్పించండి. అదే యజ్ఞం. భగవంతుడు చెప్పాడు మీరు పని చెయ్యండి, కాని ఫలితాన్ని మటుకు కోరకండి. ఫలితాన్ని కోరవద్దు అని చెప్పాడు కాని ఇవ్వను అని చెప్పలేదు. భగవంతుడు చెప్పింది ఏమిటంటే ఫలితాన్ని ఆశించద్దు అని చెప్పాడు కాని ఫలితాన్ని నేను ఇవ్వను అని చెప్పలేదు. ఫలితాన్ని ఆశించకుండా పని చేస్తే ఒకటి మీకు మంచి వస్తుంది. మీకు పని పూర్తి అవుతుంది. మీ మనసు బాగుపడుతుంది. మీ మనసుకు యోగ్యత వస్తుంది. మీ మనసుకు అర్హత వస్తుంది, భగవంతుడిని తెలుసుకునే శక్తి వస్తుంది. మీ స్వార్థాన్ని మీరు మర్చిపోయి, మీ అహంకారాన్ని మీరు మర్చిపోయి, మీరు ఏ పని చేసినప్పటికీ, భగవాన్ చెప్పారు ఎదుటివాడికి నువ్వు చేసే సహాయం అంతా నీకు నువ్వు చేసుకున్నట్టే, అది మళ్ళీ నీకే తిరిగి వచ్చేస్తుంది. అందుకే గీతలో భగవంతుడు చెప్పాడు మంచి చేసిన వాడికి దుర్గతి లేదని, ఓ అర్జునా మంచి చెయ్యి, మంచి చేస్తే నువ్వు యోగివి అవుతావు. మంచి చేసినవాడికి ఈ లోకంలో కాని పరలోకంలో కాని దుర్గతి లేదు.

భగవాన్ ఎక్కువ మాటలు ఏమి చెప్పరు, ఒక్క చూపు వల్ల మన అంతరంగిక జీవితం మారిపోతుంది, మన జీవిత విధానమే మారిపోతుంది. మీరు అందరూ సాధనలు చేస్తున్నారు రైటే, సాధన చేసే సాధకుడు ఎవరు? శేషాద్రిస్వామి అరుణాచలేశ్వరుడికి నమస్కారం

పెడుతున్నాడు. ఆయనతో భగవాన్ అన్నారట, నమస్కారం పెట్టేవాడు ఎవడు? నమస్కారం పెట్టించుకునేవాడు ఎవడు? అంటే ఆ గుట్టు ఏమిటో నాకు తెలియటం లేదు, ఇలా నమస్కారం పెట్టటమే నాకు ఇష్టం. దేవుడు నాకు వేరుగా ఉండటమే నాకు ఇష్టం, మీరు చెప్పేవి నాకు అర్ధం కావటం లేదు అని లేచి వెళ్ళిపోయాడు శేషాద్రి. భగవాన్ లో విశేషం ఏమిటి అంటే ఆయనకు దేవుడి మీద భక్తి ఉంది. దేవుడి మీద ప్రేమ ఉంది, కాని తనకంటే దేవుడు వేరుగా ఉన్న సంగతి ఆయనకు తెలియదు.

ఏవండీ భగవాన్ లేని ఈ ప్రపంచంలో మనం ఉన్నామా? భగవాన్ ఇప్పుడు లేరా? భగవాన్ సజీవంగా ఉన్నారు. కళ్ళు ఉన్నవారు చూడండి. ఆయన మన హృదయంలో ప్రకాశిస్తున్నాడు, హృదయంలో సజీవంగా ఉన్నాడు, 1950 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేది సాయంత్రం 8:45 నిమిషాలకి ఆయన శరీరం విడిచి పెట్టారు. ఆకాశంలో పెద్ద జ్యోతి ప్రకాశించింది. ఆ జ్యోతి అరుణాచల శిఖరంలో లీనమయ్యింది. వేలాదిమంది ఆ జ్యోతిని చూసారు. ఇది భాగవతంలో కృష్ణుడు నిర్వాణం అయినప్పుడు ఈ జ్యోతి కనిపించింది. భాగవతం నిజమో, అబద్ధమో, ఇది నిన్న కాక మొన్న జరిగిన సంఘటన బహుశా రాముడు అబద్ధం, కృష్ణుడు అబద్ధం అని ఎలా అనుకుంటున్నామో ఇంకొక నాలుగు వందల సంవత్సరాలు అయిపోయిన తరువాత ఈ రమణస్వామి అబద్ధం అని కూడా అలాగే ఈ లోకం అనుకోవచ్చు. ఈ లోకానికి మంచి అంటే గౌరవం ఉండదు, నిజం అంటే గౌరవం ఉండదు. ఎందుచేత? ఈ లోకం నిజం కాదు కాబట్టి, ఈ లోకం ఎప్పుడూ నిజాన్ని ప్రేమించదు. ఎందుచేత? ఈ లోకం నిజం కాదు కాబట్టి. ఈ లోకం ఏసుక్రీస్తుని శిలువ వేసింది, గాంధీగారిని కాల్చి చంపింది, రమణమహర్షిని బెడ్డలు పెట్టి కొట్టింది, సోక్రటీసును విషం పెట్టి చంపించింది, ప్రతీ మహాత్ముడిని తరిమి, తరిమి కొట్టింది. ఏ మహాత్ముడిని ఈ లోకం గౌరవించలేదు, గౌరవించే అలవాటు దీనికి లేదు. మనకి అజ్ఞానం పోవాలి అంటే మంచి మంచి విషయాలు వినాలి. విన్నది ఇంటికి వెళ్ళిన తరువాత మననం చెయ్యాలి. అప్పుడు లోపల ఉన్న అజ్ఞానం పలుచబడుతుంది. ఆస్బర్న్ భగవాన్‌తో “నా బంధువులను, నా స్నేహితులని, నా ఆస్తులని, నా దేశాన్ని, నా మతాన్ని, విడిచి పెట్టి మీ దగ్గరకి వచ్చాను. ఇప్పుడు మీ శరీరం పడిపోతోంది. మరి నా మాట ఏమిటి?” అని అడిగారు. అప్పుడు భగవాన్ “ఓ ఆస్బర్న్! పూర్వజన్మలలో ఏమి సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసుకున్నామా? ఈ సంబంధం రాబోయే జన్మలలో మనలని కలపదా?” అన్నారు. పులి నోట్లో మనం చెయ్యి పెడితే బయటకి లాక్కోవచ్చు కానీ గురువు యొక్క అనుగ్రహంలో, ఈశ్వరుడు యొక్క అనుగ్రహంలో ఎవడు అయితే పడ్డాడో వాడు తరించే వరకు, వాడు మోక్షాన్ని పొందే వరకు, వాడు జ్ఞానం పొందే వరకు వాడిని గురువు విడిచి పెట్టడు వాడే గురువు. గురువు అంటే ఈ దేహం కాదు, గురువు అంటే ఆత్మ.



# అరుణాచల మహత్మ్యం అక్షరమణమాల

**సోమరియైతిని మిన్నని సుఖనిద్ర**
**కన్న వేరేది గతి అరుణాచలా ।37।**

**తాత్పర్యము :** ఎరుకలో నిద్రసుఖాన్ని మరిగి సోమరినైన నేను ఈ లోకములో పొందదగిన పరమస్థితి ఇంకేముంది అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా! నాకు ద్వైతబుద్ధి పోయింది. ఈ రాగద్వేషాలని, ఈ అహంకారాన్ని, అజ్ఞానాన్ని అన్నీ దాటి వెళ్ళిపోయాను. ఈ లోకానికి పనికి రాకుండా అయిపోయాను! ఇంక సుఖంగా నిద్రపోవటం కంటే నాకు వేరే గతి ఏముంది అరుణాచలా.

ఇక్కడ రమణస్వామి ఉద్దేశం ఇరువైనాలుగు గంటలు నిద్రపోమని కాదండీ. నిద్రలో మనందరికీ సుఖంగా శాంతిగా ఉంటుంది. అందుకే నిద్ర కోరుకుంటాము. నిద్ర పట్టకపోతే వైద్యుల దగ్గరికి వెళ్ళి నిద్రమాత్రలు మింగుతాము. నీ ఇంద్రియాలు, మనస్సు ఇవ్వలేని శాంతి, నీ వైభవాలు, రూపాయలు, చదువులు, నీ గొప్పలు ఇవ్వలేని శాంతి, నిద్రలో ఉంది. ఆ సుఖాన్ని ప్రతి జీవుడు కోరతాడు. నేను సుఖంగా నిద్రపోవటం కంటే నాకు కావలసింది ఏమీ లేదు అని ఇక్కడ రమణస్వామి అనే పెళ్లికుమార్తె అరుణాచలేశ్వరుడనే పెళ్లి కుమారుడితో చెపుతోంది. అయితే మనందరం సుఖంగానే నిద్రపోతున్నాము. ఇక్కడ రమణ స్వామి చెప్పేది ఏమిటంటే, ఈ జాగ్రదావస్థలో సుఖంగా నిద్రపోవాలి. అంటే మెలుకువగా ఉండాలి, ఆ మెలుకువలో నిద్రస్థితిని సంపాదించాలి. అది సుఖనిద్ర అంటే.

నిద్రలో ఎవరూ మేము స్త్రీలము, మేము పురుషులము, మేము భారతీయులము అనుకోవటం లేదు. నిద్రలో తాను ఉన్నాడు, కాని తాను కల్పించుకున్నవి లేవు. అక్కడ దేశం లేదు, జాతి లేదు, అహంకారం లేదు, సెక్స్ లేదు, రంగు లేదు. నిద్రలో నువ్వు ఉన్నావు, నువ్వు కల్పించుకున్నవి ఏమీ లేవు, కాని నువ్వు సుఖంగా ఉన్న మాట నిజం. తెల్లవారి

లేచిన తరువాత రాత్రి బాగా నిద్ర పట్టింది అని నువ్వుచెప్పి ఎంతో సంతోషిస్తున్నావు. నువ్వు లేకపోతే రాత్రి నాకు బాగా నిద్ర పట్టింది అని ఎవరు చెపుతున్నారు?

నిద్రలో ఈ లోకమే లేదు, ఇంక దేవుడు ఎక్కడినుంచి వస్తాడు? నిద్రలో ఎవరూ రామ, కృష్ణ, లేకపోతే మాది హిందూమతం, మాది క్రైస్తవమతం, మాది మహమ్మదీయ మతం, ఇలా అనుకోవటం లేదు. ఇవన్నీ కూడా మనస్సు యొక్క కల్పితం. దేవుడు కూడా నిద్రలో లేడు. మెలుకువ వచ్చిన తరువాత ఈ లోకాన్ని చూస్తున్నప్పుడు, దీనికి ఎవడో సృష్టికర్త ఉండాలి, లేకపోతే సృష్టి లేదు అని మీరు లోకాన్ని చూసిన తరువాత దేవుడు అనే గొడవ వస్తోంది. కాని, మీకు లోకం లేనప్పడు దేవుడి గొడవ లేదు.

అటువంటి సుఖనిద్ర, కేవలము ఆత్మస్థితిని పొందటం మాత్రమే నాకు గతి. అదే నిజమైన స్థితి, అదే శాశ్వతమైన శాంతి స్థితి. అదే మోక్షం! సుఖనిద్ర అంటే, మనం నిద్రలో ఎటువంటి సుఖాన్ని పొందుతున్నామో, జాగ్రదవస్థలో అటువంటి సుఖాన్ని పొందాలి. నిద్రలో మనం ఉన్నాము, కాని అక్కడ అజ్ఞానం ఉంది. నిద్రలో అంతా బాగానే ఉంది కాని నాకు ఏమీ తెలియదు అంటున్నావు, అది అజ్ఞానం. ఆ అజ్ఞానం లేని స్థితి, జ్ఞానస్థితి నీ జాగ్రదవస్థలోకి రావాలి. ఆ శాంతిని ఇక్కడ పొందాలి. అటువంటి నిద్రస్థితి, అంటే అటువంటి తురీయస్థితి, అటువంటి మోక్షస్థితి, నిర్వాణస్థితి నాకు కావాలి. అదే నాకు గతి అదే నాకు గమ్యం ఓ అరుణాచలేశ్వరుడా.

రమణస్వామికి ఏమైనా గొప్పలు, గౌరవాలు, రూపాయలు, చదువులు కావాలా? లోకానికి సంబంధించినంత వరకూ ఆయన మరణించాడు. అందుచేత సోమరి అయిపోయాను అని చెపుతున్నాడు. ఆయనకి లోకమే లేదు. లోకం లేని వాడికి దేవుడు ఏమిటి? నువ్వు దేహాన్ని అనుకొన్నప్పడే నీకు దేవుడు యొక్క భావన వస్తోంది. కాని నువ్వు ఎప్పడైతే ఆత్మస్థితిని పొందావో, జ్ఞానస్థితిని పొందావో అక్కడ దేహంతో, లోకంతో, దేవుడితోటి కూడా సంబంధం లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు. అది వీటన్నిట్లకీ అతీతం.

నువ్వు ప్రపంచంలో ఉండాలి, జాగ్రదవస్థలో ఉండాలి, ప్రపంచానికి అతీతుడవు అవ్వాలి. అటువంటి నిష్ప్రపంచ స్థితిని పొందటంకంటే నాకింక గతి ఏముంది. నేనీ లోకానికి పనికొచ్చే వాడిని కాదు, లోకంలో నాకేమీ అక్కరలేదు. నేను సుఖంగా నిద్రపోవటం కంటే, అంటే మోక్ష స్థితిని పొందటం కంటే ఇంకా గతి నాకేముంది అరుణాచలేశ్వరుడా, అంటున్నారు రమణస్వామి.

# అరుణాచలా శ్రీరమణ రూపా శ్రీనాన్న గురుదేవా!

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుంచి సేకరణ)

రమణ భగవాన్ తిరుచ్చుళి నుంచి అరుణాచలం వచ్చారు అని చెప్పటం కంటే, అరుణాచలేశ్వరుడే తిరుచ్చుళిలో దేహం ధరించి అరుణాచలం వచ్చారు అని చెప్పాలి. భగవానుకి అరుణాచలానికి ఉన్న సంబంధం మనం మాటలతో చెప్పలేము. అది మన మనస్సుకు మన ఆలోచనలకు అతీతం. 54 సంవత్సరాలు రమణుడి దేహం అరుణాచల పుణ్యక్షేత్రంలో, ఈ పావన క్షేత్రంలో, ఈ అగ్నిక్షేత్రంలో తిరుగాడినది. ఈ 54 సంవత్సరాలలో అరుణాచలక్షేత్రాన్ని విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలి అనే తలంపు కూడా నాకు రాలేదు అన్నారు భగవాన్. ఆ కొండ చలించలేదు, ఈయన చలించాడు అంతే, అంతకన్నా తేడా ఏమీ లేదు.

1959వ సంవత్సరం జనవరిలో మొదటిసారి నేను (నాన్నగారు) ఈ క్షేత్రానికి వచ్చాను. రమణభగవానుకు మాకు ఉన్న సంబంధం ఏమిటో తెలియదు కానీ ఆయన నాకు దేవుడు గానో గురువు గానో ఆచార్యుడు గానో కాకుండా, కుటుంబసభ్యుడిగానే మాకు స్ఫురిస్తూ ఉంటారు. అది ఏదో జన్మాంతరాల అనుబంధం.

- సద్గురు శ్రీ నాన్నగారు.

# మహాత్ముల లక్షణం

శ్రీ కృష్ణుడు గోవర్ధన పర్వతం ఎత్తి చాలా గొప్ప పని చేశాడు. అటువంటి కొండలు ఎత్తే గొప్ప శక్తి నాకు ఇవ్వాలి అని ఒక దొరగారు రమణమహర్షిని ప్రార్థిస్తే, అప్పుడు భగవాన్ అన్నారట, శ్రీ కృష్ణుడు నేను చాలా గొప్ప పని చేశాను, నేను కొండ ఎత్తేశాను, నేను చాలా గొప్ప వాడిని అని ఏమీ అనుకోలేదు. నువ్వు అనుకొంటున్నావు కృష్ణుడు గొప్ప పని చేసాడని. మనం ముఖం ఎలా కడుక్కుంటున్నామో, స్నానం ఎలా చేస్తున్నామో, అన్నం ఎలా తింటున్నామో, మంచి నీళ్ళు ఎలా తాగుతున్నామో, అంత నేచురల్ గానే అంత సహజంగానే కొండను కూడా ఎత్తాడు కృష్ణుడు. గొప్పవాడు ఎవడు కూడా పైకి ఏమి కనపడడు, మాములుగా తాను చేయవలసిన ఉపకారం చేస్తూ ఉంటాడు. అందుకే లోకం గ్రేట్ మేన్‌ను అర్థం చేసుకోలేదు. ఒక ఋషిని కాని, ఒక మహాత్ముడిని కాని, ఒక జ్ఞానిని కాని అర్థం చేసుకోవటం కష్టం. వాళ్ళని అపార్థం చేసుకోవటం తేలిక. ఎందుచేతంటే వాళ్ళు మాటలు మాట్లాడరు వాళ్ళ మీద బురద చల్లినా వాళ్ళు సమాధానంఇవ్వరు.

రమణస్వామిని ఎవరో విమర్శించారని మహదేవన్ గారి దగ్గర ప్రస్తావిస్తే, అప్పుడు మహదేవన్ గారు ఒక మాట అన్నారట. సూర్యుడి మీద ఉమ్ములు వేస్తుంటే, మీ ఉమ్ము సూర్యుడి దాకా వెళ్ళదు, అది తిరిగి మీ ముఖం మీదే పడుతుంది. సమాజానికి ఎప్పుడూ

కూడా గ్రేట్ మేన్‌ను అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఎందుకంటే సమాజానికి గ్రేట్నెస్ లేదు కదా! ఎదుటి వ్యక్తిలో ఒక క్వాలిటీ ఉంది అనుకోండి ఆ క్వాలిటీ మనలో లేకపోతే ఆ క్వాలిటీ విలువ కూడా మనకు తెలియదు. అది మనలో లేదు కాబట్టి అర్థం చేసుకోవడం చాలా కష్టం. మన పరిధిలోనే మనం ఆలోచిస్తాం. మన మనస్సనే చిన్న కిరసనాయిలు దీపాలు పెట్టుకొని మనం ఆలోచిస్తున్నాము. మన పొలం లోనే వర్షం కురిస్తే బాగుండును ఇంక ఎదుటి వారి పొలంలో వర్షం కురవకపోయినా ఫర్వాలేదు అనే సంకుచిత హృదయులం మనం, ఆ ఎండ ఏదో మనకే తగిలితే సరిపోతుంది పక్క వాడికి ఎండ అక్కర్లేదు అనుకుంటాం. సూర్యుడు అలా అనుకుంటాడా? సూర్యుడు లోకం అంతా ఆక్రమిస్తాడు. లోకాన్ని నాశనం చేయటం కోసం కాదు తన వెలుగు లోకానికి ఇవ్వటం కోసం ఆక్రమిస్తాడు. అది మహాత్ముల లక్షణం.

# శ్రీనాన్నగారి మీటింగుల ప్రయోజనం

మీరు నూటికి నూరు పాళ్ళు సుఖం పొందాలి, నూటికి నూరు పాళ్ళు శాంతి పొందాలి. మీరు బాబాగారి భక్తులు అవ్వవచ్చు, రామకృష్ణుడి భక్తులు అవ్వవచ్చు, లేకపోతే మరొకరి భక్తులు అవ్వవచ్చు. ఎవరి భక్తులైనా మాకు (నాన్నగారికి) అభ్యంతరం లేదు. మాకు కావలసింది ఏమిటంటే మీరు జీవన్ముక్తి సుఖం పొందాలి, స్థితప్రజ్ఞులు అవ్వాలి. మీ శరీరం ఈ భూమిమీద తిరుగాడుతున్నప్పుడే మోక్షసుఖం, నిర్వాణసుఖం ఆ స్వర్గసుఖం మీరు పొందాలి. మా మీటింగులు యొక్క లక్ష్యం అదే. మరో భౌతికమైన ప్రయోజనం మా మీటింగులకి ఏమీ లేదు. కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనమే.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# కాల ప్రవాహము

మరొక నూతన సంవత్సరం 2023కి స్వాగతం పలికాం! మానవ జీవితం కాల రూపంలో ఉంది. కాలము, జీవితము రెంటికీ మధ్య ఉన్నది విడదీయలేని సంబంధమే. పరమాత్మ మనకు మానవుడిగా జీవించే మహత్తర అవకాశాన్ని కానుకగా ప్రసాదించాడు. ఈ కాలరూపములో ఉన్న మానవ జన్మను సద్వినియోగం చేసుకోవాలంటే ఎలా? అన్న ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు మన 'ఆర్తి' నిజమైనప్పుడు, 'సద్గురువు' మన జీవితాలలోకి ప్రవేశిస్తారు. పూర్ణస్థితిని, పరమ నిర్వాణస్థితిని, ప్రాప్తింపజేసుకోవడానికి ఈ మానవ జీవితం ఒక అవకాశమే తప్ప వేరు కాదు. కాలము ప్రవాహములాంటిది. ముందుకు సాగడమే కానీ వెనక్కి తిరగదు. గతము అన్నది స్మృతి రూపం, భవిష్యత్తు అన్నది ఊహా రూపం, వర్తమానం అన్నది నిజము కాబట్టి మనిషి వర్తమానంలోనే జీవించాలి. కాలం ఎవరిపైనా దయ చూపదు, ఎవరి కోసమూ ఆగదు, తన పని తాను చేస్తూ సాక్షీభూతంగా సాగిపోతుంది. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ వివేకంతో జీవించాలి, సమగ్రంగా జీవించాలి, జీవితాలు సుసంపన్నంగా ఉండాలి, మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి. స్వయం పరివర్తనే - విశ్వ పరివర్తనం. ఇప్పుడు, ఇక్కడ ఈ వర్తమానంలో నేను స్వయంగా బ్రహ్మమే! ఇప్పుడు, ఇక్కడ లేనిది ఎప్పుడో, ఎక్కడో లేదు, రాదు. చీకటిలో కూర్చుని దీపాన్ని, వెలుతురును స్మరిస్తే చీకటి తొలగదు. అన్నం పేరును స్మరిస్తూ కూర్చుంటే ఆకలి తీరదు. దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందకుంటే బ్రహ్మానుభూతి కలుగదు. కాబట్టి దేశ, కాల, కర్మలలో జాగ్రత్త అవసరము. మన తలంపు, మాట, చేత, మన ఆధ్యాత్మిక అభివృద్ధికి, చిత్తశుద్ధికి తోడ్పడాలి. కాల రూపంలో ఉన్న మానవ జీవితం అనేది ఆటలాడు కోదగిన చిల్లర వస్తువు కాదు. చిత్తశుద్ధితో, నిజాయితీతో శ్రమించి గమ్యమైన మనోనాశాన్ని సాధించాలి. సరియైన అవగాహన, వివేక, వైరాగ్యములు పెంపొందించు కోవాలి. సమబుద్ధితో, కర్తృత్వ బుద్ధి పెట్టుకోకుండా, నిష్కామంగా, కర్మ చేస్తూ, మానసిక పరిణితిని సాధించాలి. మన ద్వారా ఏ పని జరిగినా అది పరమాత్మ చేయించేదే! జీవితం అనే మహారణ్యంలో ఆత్మ జ్ఞానమే - శరణ్యం. పరమాత్మ ప్రసాదించిన ఈ మానవ జీవితాన్ని అర్థవంతముగా జీవిస్తూ, మన పరమ లక్ష్యం వైపుకు చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. 'కాలం'లో ఉంటున్నట్లు కనిపించేది, నిజానికి కాలాతీతమైన ఉనికే!

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

## పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో వెలసిన దివ్యక్షేత్రాల సందర్శనం

**(గత సంచిక తరువాయి)**

మహాత్మాగాంధీ 1946 సం॥లో జిన్నూరు నుంచి మా గ్రామానికి కారులో వచ్చారు. ఇదే వేదిక మీద నుంచి స్వాతంత్ర్యం పొందాలనే సందేశం ఇచ్చారు. నాకు అప్పుడు 3 సం॥ల వయస్సు. మా తండ్రిగారు నన్ను వారి భుజాల మీద ఎక్కించుకొని బాపూజీకి ఒక గజం దూరంలో నాకు దర్శనమిప్పించారు. అది నా పూర్వజన్మ పుణ్య సంస్కారం. గాంధీజీని స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే అనుకుంటారు. ఆయన జ్ఞాని. వారి సాహిత్యం "నా జీవితమే నా సందేశం" అనే గ్రంథాలు చదివితే తెలుస్తుంది.

మా అర్ధవరం గ్రామంలో కార్తీక మాసంలో కోటి దీపోత్సవం జరుగుతుంది. మూడు వీధుల సెంటరులో ఉన్న పార్వతీ మల్లీశ్వరస్వామి ఆలయం ముందునున్న వేదిక పైనుంచి, తూర్పు, ఉత్తరం, దక్షిణం వీధుల్లో సుమారు ఒక కిలోమీటరు బారున బెంచీలు కుర్చీలు అటుఇటుగా ఏర్పాటుచేసి బెంచీకి ముగ్గురు చొప్పన భక్తులను కూర్చోపెట్టి బెంచీ మీద తులసి, రావి, గన్నేరు, మారేడు మొక్కలు పెట్టి శివపార్వతులు, లక్ష్మీనారాయణుల ఫొటోలు పెట్టి బ్రాహ్మణులు సామూహికంగా మంత్రం చెప్పి ఈ క్రతువుని నిర్వహించటం జరుగుతుంది. దీనికి 25 డబ్బాలు ఆవునెయ్యి కమిటీవారు ఏర్పాటు చేస్తారు. మట్టి పళ్ళేలలో దీపపు వత్తులు పెట్టి జ్యోతిని ప్రజ్వలింపచేస్తారు. వేదిక మీద అలంకరించిన బాలవెంకటేశ్వరస్వామి, పార్వతీ మల్లీశ్వరస్వామికి పుష్పయాగంలో తులసి, గులాబీ, చామంతి వగైరా పుష్పాలతో బ్రాహ్మణులు పూజ చేస్తారు. ఆ పూలకు 25 బస్తాలు వినియోగిస్తారు. ఈ దృశ్యాన్ని పెద్ద స్క్రీన్ గల తెరపై భక్తులు, గ్రామస్తులు చూస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో అర్ధవరం గ్రామంలో మాత్రమే ఇది జరుగుతుంది. హైదరాబాద్‌లో ఒక పత్రికా అధినేత కూడా చేస్తారు. ఈ క్రతువును బాలవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఖర్చులను భక్తులు దండు వెంకట రామరాజు నిర్వహిస్తారు. పార్వతీ మల్లీశ్వరస్వామి ఆలయంలో పి. ఆదినారాయణరాజు కంపెనీ భాగస్తులు ఖర్చు పెట్టుకుంటారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో ఇతర గ్రామాల నుంచి భక్తులు వచ్చి పాలు పంచుకుంటారు. క్రతువు అనంతరం గ్రామస్తులకు భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుంది. బాణాసంచా, మంగళవాయిద్యాలతో క్రతువు పరిసమాప్తమవుతుంది. ఈ క్రతువు నిర్వహించిన పై వ్యక్తులకు పార్వతీ మల్లీశ్వరస్వామి, బాలవెంకటేశ్వరస్వామి ఆశీస్సులు నిండుగా ఉంటాయని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**